Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 31.07.2015, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 09 పేజీలు : 12, వెల : ₹ 5


ISO 9001-2008
Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
CARE SUPER SPECIALITY DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For
State Government, APSPDCL & SHAR Employees

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com




# జాతిరత్నమా...
# జోహార్!

11లో

నన్ను కన్న
నా దేశమా...
జైహింద్




» స్ఫూర్తిని రగిల్చి, కీర్తిని మిగిల్చి, జ్ఞానసాగరాన్ని మథించి, విజ్ఞాన గనులను పెళ్ళగించి భువి నుండి దివికేగిన దివ్యమూర్తి.

» త్రేతాయుగంలో రామసేతు నిర్మాణంతో పునీతమై, ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన రామేశ్వరం మీ స్పర్శతో మరోసారి పవిత్రమైంది, పుణ్యక్షేత్రమైంది.

» ఏ మట్టిపై పుట్టారో, ఏ నేలపై నడిచారో, ఏ ఊరిలో చదువుకున్నారో, అదే ఊరిలో అదే నేలపై, అదే మట్టిలో మమేకమయిన మహానుభావా... నీవు చేరిన ఈ మన్ను ఇక మహాపవిత్రం.

» నిత్య చైతన్య కెరటమా... నిత్యం వెలిగే విజ్ఞానదీపమా... భారతీయుల గుండెల్లో ఆశాదీపం నీవే... చైతన్య రూపం నీవే... జోహార్... జోహార్...

కలల యోధుడా... మా కలాముడా!


కీ॥శే॥ బద్వేలు వెంకట సుబ్బమ్మ గారు
మరణం : 03-08-1991

## 24వ వర్ధంతి

మమతానురాగాలతో మమ్ములను
గుండెల్లో దాచుకున్న అమృతమూర్తి
మా ఇంటి దైవం
**బద్వేలు వెంకట సుబ్బమ్మ గారి**
24వ వర్ధంతి (03-08-2015)
సందర్భంగా వారిని స్మరించుకొంటూ...
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

కుమారులు - కోడళ్లు : లేట్ బద్వేలు రమణారెడ్డి - లేట్ శ్రీదేవమ్మ
లేట్ బద్వేలు ఆదిశేషారెడ్డి - సరసమ్మ
బద్వేలు కృష్ణారెడ్డి - యశోదమ్మ
లేట్ బద్వేలు గోపాల్‌రెడ్డి - సుజాతమ్మ
బద్వేలు శ్రీనివాసులురెడ్డి - రేణుకమ్మ
బద్వేలు సుధాకర్‌రెడ్డి - శైలమ్మ

కుమార్తెలు - అల్లుళ్లు : లేట్ బుజ్జమ్మ - లేట్ దేవిరెడ్డి సుందరరామిరెడ్డి
లేట్ శేషమ్మ - లేట్ చెన్నూరు వెంకటసుబ్బారెడ్డి
కౌశల్యమ్మ - బండి రామస్వామిరెడ్డి

మనుమలు, మనుమరాళ్ళు, ముని మనుమలు, ముని మనుమరాళ్ళు

VAMSIRAM BUILDERS Hyderabad
మనుమడు - బద్వేలు సుబ్బారెడ్డి - జ్యోతి
ముని మనుమరాలు - బద్వేలు సోహిని

• పొగాకు రైతుల దీన స్థితి

# అమ్మబోతే అడవి... కొనబోతే కొరివి



నెల్లూరుజిల్లాలో పొగాకు రైతుల పరిస్థితి 'అమ్మబోతే అడవి... కొనబోతే కొరివి' చందంగా వుంది. జిల్లాలో దాదాపు 35వేల ఎకరాల్లో పొగాకు పంట సాగవుతోంది. ఉదయగిరి నియోజకవర్గంలోని కలిగిరి, వింజమూరు, కొండాపురం, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో, ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడు, ఆత్మకూరు, ఏఎస్‌పేట, అనంతసాగరం మండలాల్లో పొగాకు సాగు చేస్తున్నారు. వీటి పరిధిలో డిసిపల్లి, కలిగిరిలో పొగాకు వేలం కేంద్రాలున్నాయి. కలిగిరి పొగాకు వేలం కేంద్రం పరిధిలో 1465బ్యారన్లలో 1640మంది రైతులు 5750హెక్టార్ల విస్తీర్ణంలో పొగాకు పండిస్తున్నారు. డిసిపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలో 1700బ్యారన్లలో రెండువేల మంది రైతులు 6500హెక్టార్లలో సాగుచేస్తున్నారు. ఈసారి వర్షాభావ ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల నాణ్యమైన గ్రేడు పొగాకు దిగుబడి రాలేదు. దీంతో పొగాకు కొనేందుకు కంపెనీలు మొగ్గు చూపడం లేదు. ప్రతియేడాది కొనుగోలులో 17కంపెనీలు పాల్గొంటుంటే ఈ ఏడాది ఏడెనిమిది కంపెనీలు ముందుకు రాలేదు. రైతులు ఎకరా పొగాకు సాగు చేయాలంటే దాదాపు రూ.45వేల నుంచి రూ.50వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ ఏడాది మార్కెట్ పరిస్థితులు చూస్తుంటే కనీసం పెట్టుబడులైనా వచ్చే అవకాశం కనిపించడం లేదు. పండించిన పంట కొనేవాడు లేక పెట్టుబడులు రాక అప్పులతో సతమతమవుతున్నారు పొగాకు రైతులు.


# కిటకిటలాడుతున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు

భూములు స్థలాలు మార్కెట్ విలువలు ఆగస్టు 1 నుండి పెరగనుండటంతో జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిటలాడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు స్టాంపులు & రిజిస్ట్రేషన్ శాఖ ప్రస్తుతమున్న మార్కెట్ విలువలను 20 నుండి 70శాతం వరకు ఏరియాల ప్రాముఖ్యతను బట్టి, ప్రైవేటు రేటుకు ఇంచుమించుగా భారీగా మార్కెట్ విలువలను పెంచడంతో పాటు కట్టుబడి ధరలను కూడా పెంచింది. దీంతో రిజిస్ట్రేషన్ చేసుకునే వారి సంఖ్య భారీగా పెరిగింది. జిల్లాలోని గూడూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ పరిధి క్రింద 10 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, నెల్లూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ పరిధి క్రింద 9సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తున్నాయి. నెల్లూరు నగరంలో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, స్టోన్‌హౌస్‌పేట, బుజబుజనెల్లూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గత వారం రోజులుగా భారీ స్థాయిలో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ప్రభుత్వం ప్రతి యేడాది ఆగస్టు1న మార్కెట్ ధరలు పెంచాల్సి వున్నా గత యేడాది మాత్రం మార్కెట్ విలువలను పెంచలేదు. పెరిగిన మార్కెట్ ధరలతో పేద మధ్య తరగతి ప్రజలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వుంది.

# ఇక్కడ కంటే... అక్కడే నయం




మన రాష్ట్రం కంటే తమిళనాడు రాష్ట్రంలో లీటర్ పెట్రోల్ ధర మీద రూ.6.32, డీజిల్ మీద రూ.4.53తక్కువగా ఉండడంతో జిల్లా సరిహద్దు ప్రాంతం తడ పెట్రోలు బంకులపై దీని ప్రభావం స్పష్టంగా కనపడుతోంది. మన రాష్ట్ర వాహనాల వారు అటువైపే మొగ్గు చూపుతున్నారు. తడలో కాకుండా తమిళనాడులోని ఆరంబాకంలో డీజిల్ పట్టిస్తే లారీ యజమానికి వేలల్లో తేడా కనపడుతోంది. దీంతో లారీ యజమానులు, రైతులు తమిళనాడులో డీజిల్ పట్టించుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. జిల్లాలో విక్రయాలు గణనీయంగా పడిపోయాయి. తడకు సమీపంలోనే తమిళనాడులోని ఆరంబాకం ఉండడంతో సరిహద్దు గ్రామాల రైతులు డీజిల్‌ను అక్కడి బంకుల్లో పట్టుకుని వెళ్తున్నారు. పెట్రోలు పరిస్థితీ అంతే. తడలో 10పెట్రోలు బంకులు ఉంటే ఒకటి, రెండు తప్ప మిగతా వాటిల్లో విక్రయాలు తగ్గిపోయాయి.




### తీరప్రాంతాల్లో

# అప్రమత్తంగా వుండాలి

తీరప్రాంత భద్రత విషయంలో అప్రమత్తంగా వుండాలని సిఐఎస్ఎఫ్ కమాండెంట్ మణీష్‌సింగ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన షార్‌లోని తన కార్యాలయంలో కేంద్ర పారిశ్రామిక భద్రతాదళాలు, మెరైన్ పోలీసులు, స్థానిక పోలీసులతో సమావేశం నిర్వహించారు. పంజాబ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రవాదుల దాడి దృష్ట్యా, షార్ భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. నిరంతర గస్తీ, పోలీసు నిఘాతో భద్రతా చర్యలను మరింత పటిష్టం చేసేందుకు కృషి చేయాలన్నారు. షార్ పరిసర ప్రాంతాల్లో అపరిచిత వ్యక్తుల సంచారం పట్ల అప్రమత్తంగా వుండాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో శ్రీహరికోట మెరైన్ సిఐ శ్రీనివాసరావు, సూళ్ళూరుపేట సిఐ విజయకృష్ణ, ఎస్ఐలు పాల్గొన్నారు.

# తడలో ఐ క్లిక్..

మండల కేంద్రమైన తడలో శ్రీసిటీ వారి సహకారంతో ఐ క్లిక్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలం కోసం జిల్లా అదనపు ఎస్పీ రెడ్డి గంగాధర్ బుధవారం పరిశీలన చేశారు. రాష్ట్ర సరిహద్దులో వున్న తడ పారిశ్రామికంగా బాగా అభివృద్ధి చెందుతోన్న నేపథ్యంలో, నేరాలను అరికట్టేందుకు అవసరమైన ఐ క్లిక్ కేంద్రం ఏర్పాటుకు శ్రీసిటీ ముందుకువచ్చింది. ఆ మేరకు ప్రజలకు అనువైన ప్రదేశాలను ఆయన పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు రావడానికి సంకోచించే బాధితులు ఐ క్లిక్ కేంద్రాల ద్వారా ఫిర్యాదుచేసుకునే వెసలుబాటు వుంటుందని ఈ సందర్భంగా సిఐ విజయ్‌కృష్ణ తెలియజేశారు. ఈ పరిశీలనలో ఏఎస్పీ వెంట శ్రీసిటీ భద్రతాధికారి అల్తాఫ్ తదితరులున్నారు.

# నెల్లూరుజిల్లాకు ఆత్మబంధువు



శాస్త్రవేత్తగా షార్‌లో మాజీప్రధాని ఇందిరాగాంధీతో... (ఫైల్ ఫోటో)



రాష్ట్రపతిగా షార్ పర్యటనలో... (ఫైల్ ఫోటో)

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు నెల్లూరుజిల్లాతో విడదీయ రాని అనుబంధముంది. దీనికి కారణం ఆయన అత్యంత ఎక్కువుగా ఇష్టపడే సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం(షార్ సెంటర్) ఈ జిల్లాలో వుండడమే! కలాం నుండి షార్‌ను వేరుచేసి చూడ లేము. షార్ సెంటర్ నుండే ఆయన విజ్ఞాన సాగరాలను మధించడం మొదలు పెట్టాడు.

భారత అంతరిక్ష ప్రయోగాలకు అనువైన ప్రాంతాన్ని గుర్తించేందుకు ప్రఖ్యాత శాస్త్రవేత్త విక్రమ్ సారాభాయ్‌తో కలిసి ఆయన అనేక ప్రాంతాలను పర్యటించారు. పులికాట్ సరస్సులో పడవ ద్వారా ప్రయాణించి శ్రీహరికోట దీవులకు చేరుకున్నారు. అడవిలోనే జీపులో తిరుగుతూ రాకెట్ ప్రయోగాలకు ఆ ప్రాంతం అత్యంత అనువైనదిగా గుర్తించారు. విక్రమ్ సారాభాయ్, సతీష్ ధావన్ వంటి శాస్త్రవేత్తలతో కలిసి 'షార్'ను నెలకొల్పడంలో కలాం కృషి మరువలేనిది. 1969లో డిఆర్‌డిఓ నుండి ఇస్రోకు వచ్చారు. ఎస్ఎల్‌వి-3 ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా షార్ సెంటర్‌కు వచ్చారు. 1970లో ఎస్ఎల్‌వి ప్రయోగం చేపట్టగా అది విఫల మైంది. అయినా పట్టువిడవకుండా కొన్ని మార్పులు చేసి 1980లో దానిని విజయవంతంగా ప్రయోగించారు. ఆ రాకెట్ ద్వారానే 'రోహిణి' ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టారు.

భారత రాష్ట్రపతి అయ్యాక కలాం షార్ పర్యటనకు వచ్చారు. ఆ పర్యటన ఆయనకు ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. షార్ పర్యటనలో ఆయన తన పాత మిత్రులను కలుసుకున్నారు. పాత సంగతులను నెమరు వేసుకున్నారు. తనతో కలిసి పనిచేసిన సిబ్బంది గురించి ఆరాతీసారు. రాష్ట్రపతి హోదాలో వచ్చినా షార్‌లో మాత్రం ఆయన శాస్త్రవేత్తలానే వ్యవహరించేవాడు. రాష్ట్రపతిగా వున్న సమయంలోనూ, ఆ తర్వాత కూడా షార్‌లో జరిగే ప్రతి ప్రయోగాన్ని ఆయన ఆసక్తిగా తిలకించేవారు. ఇస్రో వర్గాలు కూడా ఆయనను నిరంతరం సంప్రదిస్తుండేవి.

ఇక భారత రాష్ట్రపతిగా కలాం నెల్లూరు నగర పర్యటన ఒక జ్ఞాపకమే. 2006లో ఆయన రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలో నిర్మించిన దొడ్ల వరదారెడ్డి ట్రస్ట్ రేడియోథెరపీ విభాగం ప్రారంభోత్సవానికి విచ్చేసారు. ఆరోజే పెద్దాసుపత్రికి కూడా వెళ్లారు. ఆయన పర్యటన ముగిసాక హెలికాప్టర్‌లో చెన్నైకు వెళ్లాలి. కాని హఠాత్తుగా వర్షం రావడంతో రోడ్డు మార్గాన చెన్నైకి బయల్దేరారు. ఆయన కాన్వాయ్‌లో పెట్టిన వాహనాలలో డీజిల్ నింపలేదు. దీంతో దారిలోనే కొన్ని వాహనాలు పెట్రోల్ బంకుల వద్దకు వెళ్లాయి. కలాం ఓ చోట టీ అడిగితే అరగంట సేపటి తర్వాత కాని ఆయనకు టీ అందించలేకపోయారు. ఆయన నెల్లూరు పర్యటన అధికారుల వైఫల్యం కారణంగా ఒక చేదు జ్ఞాపకమైంది.

అబ్దుల్ కలాం మృతిపట్ల సింహపురి సీమ దిగ్భ్రాంతికి గురైంది. షార్ మూగబోయింది. జిల్లాలోని ప్రతి ఒక్కరు కూడా కలాం మృతికి కన్నీటి నివాళులర్పించారు.





దొడ్ల వరదారెడ్డి రేడియో థెరపీ సెంటర్ ప్రారంభోత్సవంలో... (ఫైల్ ఫోటో)



క్యాన్సర్ ఆసుపత్రిని పరిశీలిస్తూ... (ఫైల్ ఫోటో)



# మూడుహాళ్ళలో బ్లాక్‌టిక్కెట్ల దందా..!

- మేనేజర్లే కీలకం
- డిస్ట్రిబ్యూటర్లపై నెపం

## మంటగలుస్తున్న మాగుంట ప్రతిష్ఠ

**బాహుబలి ధర రూ.1500/- బజరంగీ భాయిజాన్ ధర రూ.700/-**

"మాగుంటోళ్ళు"... ఒకప్పుడు ఈ మాటంటే వాళ్లెవరో ఎవ్వరికీ తెలియదు. "మూడు హాల్లోళ్లు". ఈ పేరు చెబితే ఒక్క నెల్లూరుజిల్లాలోనే కాదు యావత్ ఆంధ్ర రాష్ట్రంలో కూడా మాగుంట సుబ్బరామరెడ్డి గుర్తుకు వస్తాడు. తన కీర్తితో "మాగుంట" ఇంటి పేరు తెలియని వాళ్లే లేరు అన్న స్థాయిలో ఆ కుటుంబ ప్రతిష్టను పెంచాడు సుబ్బరామరెడ్డి.

కృష్ణ, కావేరి, కళ్యాణి పేరుతో మూడుహాళ్ళకు రాఘవ సినీ కాంప్లెక్స్ అని తన తండ్రి పేరు పెట్టిన సుబ్బరామరెడ్డి కీర్తిశేషులైన అనంతరం ఇప్పుడు ఆ పేర్లు కూడా "చరిత్ర"గా మిగిలిపోయాయి.

ప్రస్తుతం ఎస్2 సినిమాస్‌గా పిలువబడుతున్న ఈ ఆధునిక సినిమా సముదాయంలో "బ్లాక్" టిక్కెట్ల దందా కూడా ఆధునిక పద్ధతుల్లోనే జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ పనిచేసే మేనేజర్ల ఆధి"ప"త్యంలో బ్లాక్ టిక్కెట్ల "లీల"లు కోకొల్లలుగా జరుగుతున్నాయని, ఇక్కడ డిస్ట్రిబ్యూటర్ల ప్రతినిధిగా చెప్పబడే ఓ వ్యక్తి "పై"రవి ద్వారా టిక్కెట్లన్నీ దొడ్డిదారిన బ్లాక్ మార్కెట్లోకి వస్తున్నాయంటున్నారు సినిమా అభిమానులు.

ఇటీవల విడుదలైన "బాహుబలి" సినిమాకి ఈ హాళ్ళలో బ్లాక్ ధర 1500రూపాయలు పలికిందంట. ఆ సినిమాకి సరే ప్రపంచ వ్యాప్తంగా క్రేజ్ వచ్చింది కాబట్టి ఎంతకమ్మినా సినిమా పిచ్చోళ్ళు కొనుక్కుంటారని అనుకోవచ్చు. కానీ గత వారం విడుదలైన "బజరంగీ భాయి జాన్" అనే సల్మాన్‌ఖాన్ హిందీ సినిమాకి కూడా టిక్కెట్ల క్రేజ్ క్రియేట్ చేసి ఒక్కొక్కటి 700రూపాయలకి బ్లాక్ మార్కెట్లో దర్జాగా అమ్మించేశారంట ఈ ఘనులు.

ఈ భాగోతమంతా తెలుసుకున్న వీళ్ల బాస్ ఒకాయన మేనేజర్లకి ఫుల్లుగా క్లాస్ పీకి ఇక తనకి తెలియకుండా ఒక్క టిక్కెట్ కూడా రెకమండేషన్‌పై ఇవ్వొద్దని హుకుం జారీ చేశాడంట. ఇక్కడ మేనేజర్లు కొత్త సినిమా వస్తే చాలు టిక్కెట్లకు విపరీతమైన డిమాండ్ క్రియేట్ చేసేస్తున్నారు. ఎవరైనా యంఎల్ఏ టిక్కెట్ల కోసం సిఫారసు చేసినా యంఎల్ఏ అయితే కొమ్ములొచ్చాయా, మేం మొండోళ్ళం, టిక్కెట్లు లేవు మీకు చేతనైంది చేసుకోండని మొహాన్నే కసిరేస్తున్నారంట.

మాగుంట కుటుంబీకులను అతి దగ్గరగా తెలిసిన వాళ్లు సైతం అసలోళ్లకి లేని పొగరు అహం మేనేజర్లకెందుకని ముక్కున వేలేసుకుంటున్నారంట. సినిమా టిక్కెట్‌కి కూడా అదేదో రాజకీయ 'బి' ఫారం కున్నంత డిమాండ్ క్రియేట్ చేసేసి తమ యాజమాన్యానికి ముఖ్యులైన వారికి కూడా "టిక్కెట్లు లేవు" అని సమాచారమిచ్చి దర్జాగా బ్లాక్‌లో అమ్మేసుకుంటున్నారంట.

అయ్యా మేనేజర్లు... మాగుంట కుటుంబం అంటే సమాజంలో ఓ గౌరవం వుంది. వాళ్ళ కోసం ప్రాణాలిచ్చే అభిమానులున్నారు. వారి ప్రతిష్టను ఇలాంటి లేకి చేష్టలతో మంటకలపకండి. మంచితనం, మెతకతనంతో మాగుంట సుబ్బరామన్న ఎందరో హృదయాలలో దైవం అయ్యాడు. అలాంటి మహనీయుడి కలల రూపాలైన మూడుహాళ్ళను భ్రష్టు పట్టించకండి.

# శాకంభరిగా దర్శనమిచ్చిన ఇరుకళల పరమేశ్వరి





భక్తుల శుభకార్యాలలో తొలిపూజలందుకునేది సింహపురి గ్రామ దేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు. ప్రపంచంలో మిక్కిలి శక్తి వంతమైన పదార్థాలన్నీ అమ్మవే. దానిలో ఉన్నది అమ్మే. శక్తిని కలిగించే పదార్థాలు అమ్మవే. అందుకే అమ్మవారిని మహాకవి కాళిదాసు "సర్వమంత్రాత్మికే! సర్వయంత్రాత్మికే! సర్వతంత్రాత్మికే!" అన్నారు. మంత్ర, తంత్ర, యంత్రాలే కాక శక్తిని కలిగించే కాయగూరలు, పండ్లు అన్ని అమ్మకు చెందినవే. శ్రీ శంకరాచార్యుల వారు శాకంభరిగా లక్ష్మీదేవిని స్తుతించారు. అందుకే జగన్మాతకు కాయగూరలు, పండ్లతో శాకంభరిగా అలంకరించడం అలవాటులోకి వచ్చింది. శాకంభరిగా అలంకరించిన శ్రీ అమ్మవారిని దర్శిస్తే ఆయురారోగ్యాలతో పాటు పాడిపంటలు వృద్ధి చెంది దేశం సస్యశ్యామలం అవుతుంది.

ఆషాఢ మాసోత్సవాన్ని పురస్కరించుకొని సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు కూరగాయలు వస్త్రాలుగా, పండ్లు ఫలాలు ఆభరణాలుగా శాకంభరిగా కొలువుదీరగా ఆదివారం భక్తులు విశేషంగా దర్శించుకున్నారు. నెల్లూరు మూలాపేటలోని అమ్మవారి దేవస్థానంలో విశేషంగా శాకంభరి అలంకారం నిర్వహించారు. గర్భాలయంలో కొలువుదీరిన అమ్మవారితో పాటు మండపాన్ని కూర గాయలతో కనువిందుగా అలంకరించారు. దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై గుమ్మడికాయలు, పుచ్చకాయలపై ఆకట్టుకునే అందమైన దేవతామూర్తులను తీర్చిదిద్దారు. కాకరకాయలు, కారెట్, వంకాయలు, ముల్లంగిలతో చేసిన అలంకరణలు ఆకర్షణీయంగా నిలిచాయి. దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి పొంగళ్లు పెట్టి, అంబలి నైవేద్యంగా సమర్పించారు. గంగిశెట్టి సాయి కుమార్ ఉభయకర్తగా వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఏవి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, టిడిపి నాయకుడు, మాజీమంత్రి తాళ్లపాక రమేష్‌రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు నగర ప్రముఖులు, భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


## మీ కోసమే హెల్మెట్
## ఆచరిస్తే జీవితమే హైలెట్

- హెల్మెట్ ధారణ చాలా సులభమైనపని.
- అశ్రద్ధ చేస్తే జరిగే నష్టం అపారం.
- మీకోసమే కాదు, మిమ్మల్ని నమ్ముకున్న వారి కోసం కూడా.. హెల్మెట్ ధరించండి, ప్రమాద రక్షణ పొందండి.

**యస్.రాఘవరావు**
డి.యస్.పి - కావలి

**యం.మధుబాబు**
సి.ఐ - కావలి రూరల్

**రఘునాథ్**
ఎస్.ఐ - కావలి రూరల్

మరియు **పోలీసు సిబ్బంది**

# 'ప్రభా'తం

ఉగ్రవాదం మరోసారి పంజా విప్పింది. తన విషపు కోరలతో పలువురిని నిర్దాక్షిణ్యంగా హత మార్చింది. పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాలో వున్న దీనానగర్‌లో సోమవారం వేకువన జరిగిన ఈ ఉగ్ర బీభత్సం దేశవ్యాప్తంగా ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురిచేసింది. ముగ్గురు ఉగ్రవాదులు పొంచివుండి, ఒక్కసారిగా దీనానగర్ పోలీస్‌స్టేషన్‌లోకి జొరబడి ఒక ఎస్పీ స్థాయి ఉన్నతాధికారితో సహా, ఏడుగురిని బలి తీసుకోవడం ఘోరం.. దారుణం. ఊహించని ఈ దుర్ఘటనకు దేశం దిగ్భ్రాంతికి గురైంది. దాదాపు పన్నెండుగంటల పాటు విధ్వంసాన్ని సృష్టించిన ముష్కరమూకలు ప్రజలను భీతావహులను చేశాయి. ఈ సంఘటనకు బలైనవారిలో ముగ్గురు పౌరులు కూడా వున్నారు.

ఆధునికమైన ఆయుధాలతో వచ్చిన ఉగ్రవాదులు పోలీస్‌స్టేషన్‌లోకి దూసుకువెళ్ళి విచక్షణారహితంగా అక్కడున్న సిబ్బందిపై కాల్పులు జరపడంతో ఆ తూటాలకు గురైనవారు ఎక్కడివారక్కడ హాహాకారాలు చేస్తూ కుప్పకూలిపోయారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే పంజాబ్ పోలీసులు, సైన్యం శరవేగంతో అక్కడికి వచ్చి ఉగ్రవాదులపై ఎదురుదాడి జరిపి, చివరికి ఆ ముగ్గురు ఉగ్రవాదులనూ హతమార్చారు. ఏదేమైనా, ఈ ఉగ్ర బీభత్సంతో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఇటీవలికాలంలో ఎలాంటి అల జడులూ-అరాచకాలు, దాడులు- దౌర్జన్యాలు లేకుండా ప్రశాంతంగా వున్న పంజాబ్‌లో హఠాత్తుగా వచ్చిపడిన ఈ ఉగ్రభూతం పలువురి ప్రాణాలు బలితీసుకుంది. ఈ దాడి వెనుక, ఎవరున్నారనే విషయం ఇంకా నిర్ధారణ కాలేదు కానీ, వారు బహుశా పాక్ సరిహద్దును దాటి వచ్చిన ఉగ్రవాదులేననే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. అయితే, ఈ దాడిలో తమ ప్రమేయమేమీ లేదని పాక్ పేర్కొం టోంది. ఈ ఘటనలో తొలుత ఉగ్రవాదులు ఆత్మా హుతి దళంగా ఏర్పడి, ఆయుధాలు, బాంబులు, గ్రెనేడ్లు తదితర మందుగుండు సామగ్రితో దీనా నగర్‌లోకి ప్రవేశించి విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఒక టెంపోను స్వాధీనం చేసుకుని, ఒక డాబా యజమానిని హతమార్చి, ఒక కారు డ్రైవర్‌ను కాల్చి చంపేసి, ఆ కారులోనే దీనానగర్ పోలీస్‌స్టేషన్‌లోకి దూసుకువెళ్ళి అక్కడున్న సిబ్బందిపై తుపాకులు ఎక్కుబెట్టారు. కనిపించినవారందరినీ కాల్చడం ప్రారంభించారు. ఊహించని ఈ ఘటనలో గురుదాస్‌పూర్ డిటెక్టివ్ ఎస్పీ బల్జీత్‌సింగ్‌తో సహా, ముగ్గురు హోంగార్డులు బలైపోయారు.

దేశంలోకి చొచ్చుకువచ్చి ఉగ్రవాద ముష్కరులు ఇంత దారుణాలకు పాల్పడుతుండడం దేశప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఇలా పొంచివున్న ఉగ్రవాదంతో ఎప్పుడూ ముప్పేనని, ఎప్పుడు- ఎక్కడ- ఎలా- ఎవరిని ఉగ్రవిషసర్పం కాటేస్తుందో తెలియని పరిస్థితి దాపురించిందని, ప్రత్యేకించి సరిహద్దు ప్రాంతాల ప్రజలు హడలిపోతున్నారు. అత్యంత పైశాచికత్వంతో వ్యవహరిస్తూ అమాయక ప్రజలనూ, పోలీసులనూ మట్టుపెడుతోన్న ఉగ్రవాదుల్ని నిర్మూలించేందుకు మాటల్లో కాక, చేతలతో పటిష్టమైన చర్యలు తీసుకోకుంటే పరిస్థితి ఇలాగే వుంటుందనే విమర్శలూ వస్తున్నాయి. సరిహద్దు ప్రాంతాల నుంచి ఉగ్రవాదులు దేశంలోకి జొరబడే అవకాశం వుందనే అనుమానాలు వున్నప్పటికీ, ప్రత్యేకించి పంజాబ్‌తో సహా పలు ఉత్తరాది రాష్ట్రాల్లో ఉగ్రవాదులు స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను భగ్నం చేసేందుకు విధ్వంసాలు సృష్టించే అవకాశం వుందంటూ ఇంటెలిజెన్స్‌బ్యూరో హెచ్చరికలు చేసినా, తగు ముందుజాగ్రత్తలు తీసుకోలేకపోవడం విచారకరం. ఎక్కడ ఏ చిన్న దారి కనిపించినా, దూరి వచ్చే ఉగ్రవాద విషసర్పాన్ని వేయికన్నులతో కనిపెట్టి వుండాల్సిన తరుణంలో ఏమరుపాటుగా వుండడం వల్లనే ఇలాంటి దుర్ఘటనలకు అవకాశం కలుగుతోందని అనుకోవచ్చు.

ఉగ్రవాదంపై పోరుకు సమాయత్తం కావాలని ప్రధాని మోదీ అంతర్జాతీయ స్థాయిలో అనేక దేశాల్లో పదేపదే ఉద్ఘాటిస్తున్నా, మనదేశంలోకి ఇలా చొచ్చుకువస్తున్న ఉగ్రవాదులపై, వారు చేస్తున్న ఉగ్రదాడులపై తీసుకుంటున్న కఠిన చర్యలు ఏమిటన్నది కేంద్రం ఒక్కసారి పునఃపరిశీలించుకోవాల్సివుంది. ఉగ్రవాదులు విధ్వంసం సృష్టించే అవకాశం వుందనే హెచ్చరికలు వున్నా, సరిహద్దులు మూసేయకపోవడం వల్లనే వారు పంజాబ్‌లోకి సులువుగా ప్రవేశించగలిగారని, ఇందుకు కేంద్రమే బాధ్యత వహించాల్సివస్తుందనీ పంజాబ్ ముఖ్యమంత్రి ప్రకాశ్‌సింగ్‌బాదల్ చేసిన వ్యాఖ్యలను కేంద్రం పరిగణనలోకి తీసుకోవాల్సి వుంది. ఒక్క పంజాబ్‌లోనే కాదు, ఏ రాష్ట్రంలోనైనా సరే ఉగ్రవాదుల చొరబాట్లకు అవకాశం వున్న అన్ని రాష్ట్రాలూ, అన్ని ప్రాంతాల్లో మరింత పటిష్టమైన చర్యలు తీసుకోకుంటే ఉగ్రవాదం వల్ల ఎప్పటికైనా ప్రమాదమే. అదేవిధంగా ఉగ్రవాదంపై పోరు విషయం లోనూ కేవలం ప్రకటనలతో సరిపెట్టుకోక, దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని అన్ని పార్టీల నాయకులతో సంప్ర దించి, సలహాలను, తగు నిర్ణయాలను తీసుకోవాల్సిన అవసరం కూడా వుంది.

ఒకవైపు ఉగ్రవాదుల చర్యలను పసికడుతూనే, మరోవైపు ఉగ్రవాదం నిర్మూలనకు పార్టీలకు అతీతంగా నాయకులందరూ కలసి ఒక ఖచ్చితమైన వ్యూహంతో, పకడ్బందీ ప్రణాళికతో ఉగ్రవాదానికి చెక్ పెట్టాల్సి వుంది. ఏ దుర్ఘటనో జరిగాక, అప్పుడు బాధపడేదానికంటే, ఉగ్రవాద భూతాన్ని ఆది లోనే అరికట్టడం ఎంతో ముఖ్యం. అందుకు అటు కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు, ఇటు వివిధ పార్టీల నాయకులు, ఉన్నతాధి కారులు అందరూ కలసి ఒక ఆచరణాత్మకమైన వ్యూహంతో ఉగ్రవాద నిర్మూలనకు సమాయత్తం కావాల్సివుంది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా మరింతగా ఆలోచించి, ఉగ్రవాదంపై పోరుకు సమిష్టిగా, సమన్వయంతో వ్యవహరించాల్సి వుంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉగ్ర వాద నిర్మూలనకు కఠినచర్యలు తీసుకోవడం తక్షణ కర్తవ్యం...!

## ఉగ్ర'పంజా'బ్



పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాలో వున్న దీనానగర్‌లో ఇటీవల ఉగ్రవాదులు చేసిన భీభత్సకాండ దేశవ్యాప్తంగా ప్రజానీకాన్ని భయాందోళనలకు గురిచేసింది. ఉగ్రవాదులు అక్కడి పోలీస్‌స్టేషన్‌లోకి జొరబడి ఒక ఎస్పీ స్థాయి ఉన్నతాధికారితో సహా, ఏడుగురిని బలి తీసుకోవడం ఘోరం..దారుణం. ఉగ్రవాదంపై పోరుకు సమాయత్తం కావాలని ప్రధాని మోదీ అంత ర్జాతీయస్థాయిలో అనేక దేశాల్లో పదేపదే ఉద్ఘాటిస్తున్నా, మనదేశంలోకి ఇలా చొచ్చుకువస్తున్న ఉగ్రవాదులపై, చేస్తున్న ఉగ్రదాడులపై తీసుకుంటున్న కఠిన చర్యలు ఏమిటన్నది కేంద్రం ఒక్కసారి పునఃపరిశీలించుకోవాల్సి వుంది.




## అలరించిన గోదావరి పుష్కర కవితోత్సవం

తెలుగు రక్షణ వేదిక ఆధ్వర్యంలో నెల్లూరు ఎన్‌టిఆర్ భవన్‌లో ఆదివారం గోదావరి మహాపుష్కరాలను పురస్కరించుకుని నిర్వహించిన కవితోత్సవం అలరించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలుగు రక్షణ వేదిక జాతీయ అధ్యక్షుడు పొట్లూరి హరికృష్ణ మాట్లాడుతూ సాంప్రదాయ జీవధార అయిన మహాపుష్కర వైభవం గోదావరి నీటికి – కవిత్వపు ఊటకి మధ్య వున్న సముద్రమంత అనుబంధం, ప్రాముఖ్యత, ప్రయోజనాలను కోరుతుందని వివరించారు. మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణా రెడ్డి, టిడిపి జిల్లా జనరల్ సెక్రటరి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి గోదావరి నది ప్రాముఖ్యతను గురించి వివరించారు. అనంతరం 36మంది కవులకు సత్కారం చేశారు.

ఈ కార్యక్రమంలో తెలుగు రక్షణ వేదిక రాష్ట్ర కార్యదర్శి కె.మురళీమోహన్‌రాజు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## 2న దువ్వూరు రామిరెడ్డి జయంతి సభ



కవి కోకిల దువ్వూరు రామిరెడ్డి 119వ జయంతి సభ దువ్వూరు రామిరెడ్డి విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో ఆగస్టు 2వ తేదీ ఆదివారం సాయంత్రం నెల్లూరు టౌన్‌హాల్లో నిర్వహిస్తున్నారు. ఈ సభకు సభాధ్యక్షులుగా న్యాయవాది పివి రమణారెడ్డి వ్యవహరిస్తారు. ముఖ్యఅతిథులుగా కడప డిప్యూటీ లేబర్ కమిషనర్ రాచపాళెం రఘు పాల్గొంటారు. ఉపన్యాసకులుగా కడప యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆచార్యులు రాచపాళెం చంద్రశేఖరరెడ్డి "కవికోకిల – సాహిత్య విమర్శ వ్యాసాలు" అనే అంశంపై ఉపన్యసించి విజ్ఞాన సమితి సమ్మానము స్వీకరిస్తారు. సభా ప్రారంభానికి ముందు సంగీత విద్వాంసురాలు జె.బాలార్క శిష్యబృందంచే భక్తి గీతా లాపన జరుగుతుంది.

## వీనుల విందుగా గాయత్రి వెంకటేశన్ గాత్రకచేరి

శ్రీకృష్ణ లీలా తరంగ ప్రచార సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ లీలా తరంగ గాత్ర కచేరి సోమవారం రాత్రి నెల్లూరు టౌన్ హాలులో నారాయణ తీర్థుల వారి 340వ జయంతిని పురస్కరించుకుని నిర్వహిం చారు. చెన్నైకి చెందిన ప్రముఖ సంగీత విద్వాంసురాలు సేలం డాక్టర్ గాయత్రి వెంకటేశన్ కృష్ణలీలా తరంగాలను ఆల పించి ఆకట్టుకున్నారు. వయోలిన్‌పై కోవై ఎస్.చంద్రన్, మృదంగంపై మనిక్కుడి ఎస్.చంద్రశేఖరన్‌లు వాద్య సహకారం అందించారు. ఈ సందర్భంగా గాయత్రి వెంకటేశన్‌ను నిర్వాహకులు సత్కరించారు. తొలుత ఈ కార్యక్రమాన్ని గోదావరిఖని ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్, లేబర్ కోర్టు ఛైర్మెన్ జి.వి.కృష్ణయ్య ప్రారంభించి మాట్లా డుతూ నారాయణ తీర్థుల తరంగ మాధు ర్యాన్ని సంగీతాభిమానులకు చేరువ చేయడం అభినందనీయమన్నారు. శ్రీకృష్ణ లీలాతరంగ ప్రచార సమితి నిర్వాహకు రాలు రాళ్ళపల్లి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాళ్ళపల్లి రామ సుబ్బారావు, డాక్టర్ సర్వేపల్లి అజయ్ కుమార్, డాక్టర్ యనమండ్ర నాగదేవి ప్రసాద్, డాక్టర్ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## కలాం కలలను నిజం చేద్దాం!

అబ్దుల్ కలాం చిత్రపటాలకు దండలు వేసి దండం పెట్టుకుంటేనే ఆయనకు నివాళులర్పించినట్లు కాదు. ఆయన కలలను నిజం చేయడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళి. ప్రపంచంలో భారత్‌ను అత్యంత శక్తివంతమైన దేశంగా నిలపడానికి ఆయన కలలు కన్నారు. తన కలలను నిజం చేయడానికి శ్రమించారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ దేశం కోసం పనిచేయాలి.

**జి.ఎస్.రెడ్డి, నెల్లూరు.**

## భక్తి పేరుతో దోపిడీ!

భక్తి కార్యక్రమం పేరుతో ప్రభుత్వమే భారీ దోపిడీకి పాల్పడింది. పుష్కరాల పనులకని 2వేల కోట్లు ఖర్చుపెట్టామం టున్నారు. ఈ డబ్బుతో ఒక ప్రాజెక్టును కట్టొచ్చు. రాష్ట్రంలోని అన్ని చెరువులను బాగుచేసి ఉండొచ్చు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితే అంతంత మాత్రంగా వుంటే, ఈ విధంగా ప్రజాధనాన్ని దోచు కోవడం దుర్మార్గం.

**– టి.నరసింహారెడ్డి, కావలి.**

## కేంద్రమంత్రి వ్యాఖ్యలు దారుణం

ప్రేమ వైఫల్యాలు, నపుంసకత్వం వల్లే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్న కేంద్రమంత్రి రాధామోహన్‌సింగ్‌ను వెంటనే మంత్రి పదవిని నుండి తొలగించాలి. నరేంద్ర మోడీ ఇలాంటి వారిని ఉపేక్షించకూడదు. ఇలాంటి మంత్రులు వుండడం మన దౌర్భాగ్యం.

**పి. రాజశేఖర్, నెల్లూరు.**

## పాఠ్యాంశంగా చేర్చాలి

భారతరత్న అబ్దుల్ కలాం జీవితచరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి. మన పాఠ్యపుస్తకాలలో ఎందుకూ పనికిరాని వాళ్ళ చరిత్రలు చాలా ఉన్నాయి. వాటి బదులు కలాం వంటివారి పాఠాలు పెడితే విద్యార్థులు స్ఫూర్తిపొందుతారు. తాను మర ణిస్తే సెలవు ఇవ్వొద్దు... ఇంకా ఎక్కువ గంటలు పనిచేయండి అని పిలుపునిచ్చిన మహనీయుడు కలాం. దీనిని అన్ని ప్రభుత్వాలు, ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలి. కలాం బాటలో నడుస్తూ ఎక్కువ సమయం పనిచేయడానికే ప్రాధాన్యతనివ్వాలి.

**సి. రాజీవ్, నెల్లూరు.**




## లాలూ అడుగుజాడల్లో

లాలూ ప్రసాద్‌యాదవ్ అడుగుజాడల్లో నడిచే యోచనలో చంద్రబాబు వున్నాడు. దాణా స్కామ్‌లో అధికారానికి దూరమైనప్పుడు లాలూ తన భార్య రబ్రీదేవిని ముఖ్యమంత్రిగా చేసి, తెరచాటు భాగోతం నడిపాడు. ఓటుకు నోటు విషయంలో బాబు అధికారానికి దూరమైతే తన భార్య భువనేశ్వరిదేవిని ముఖ్యమంత్రిగా చేసి తెరచాటు భాగోతం తానే నడపవచ్చు అన్న ధైర్యంతో ఫోన్‌లో వాయిస్ తనది కాదని కాని, అవునని కాని చెప్పకుండా నిమ్మకు నీరెత్తినట్లు గుంభనంగా ఉన్నాడు.

**కురుగూరు రంగనాథం, నెల్లూరు.**

# ఏడాదిపాలనతో మెప్పించిన రాఘవ

**వడ్డించే వారు మనోళ్లయినప్పుడు బంతి చివరిలో కూర్చున్నా ఇబ్బంది ఉండదు. అలాగే పైన ప్రభుత్వం సొంత పార్టీది అయ్యుంటే క్రింది స్థాయి పదవుల్లో ఉండే వారికి ఏ సమస్యా వుండదు. కానీ, పైన ప్రభుత్వ మొకటి, క్రింద స్థానిక సంస్థలో మరోపార్టీ వ్యక్తి పదవిలో వుంటే ప్రభుత్వం నుండి అందే సహకారం అంతంత మాత్రంగానే వుంటుంది. అయితే, ప్రభుత్వం నుండి సహకారం లేకున్నా తన ఏడాది పాలన సమర్ధవంతంగా నెట్టుకొచ్చాడు జిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి.**



జడ్పీ ఎన్నికలు, జడ్పీటీసీల శిబిరాలు, జడ్పీ ఛైర్మెన్ ఎన్నికల్లో రచ్చులు రావిళ్లు, జడ్పీ ఛైర్మెన్ ఎన్నికకు లాటరీ... అంతా కూడా నిన్న మొన్న జరిగినట్లుగా వుంది. అప్పుడే ఏడాది గడిచిపోయింది. జడ్పీ ఛైర్మెన్‌గా రాఘవ బాధ్యతలు చేపట్టి ఏడాదైంది. రాఘవకు ముందు కాకాణి గోవర్ధన్‌రెడ్డి జడ్పీ ఛైర్మెన్ బాధ్యతలు నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవడం తెలిసిందే! అయితే కాకాణి పరిస్థితి వేరు. ఆయన కాంగ్రెస్ జడ్పీ ఛైర్మెన్. అప్పుడు రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే వుండింది. అదీగాక ఏదడిగినా చేసే వై.యస్.ఆర్ ముఖ్యమంత్రిగా వున్నాడు. కాకాణికి సంపూర్ణ సహాయసహకారాలు లభించాయి. కాకాణి కూడా అవినీతి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా పనిచేసి జడ్పీ పాలనపై తనదైన ముద్రను వేసుకున్నాడు.

కాకాణికి ఆరోజు ప్రభుత్వం అండగా నిలిచింది. ఇప్పుడు రాఘవ పరిస్థితి అది కాదు. పైన తెలుగుదేశం ప్రభుత్వం వుంది. ఈయన వైకాపా మనిషి. ఎంతవరకు ప్రభుత్వం ఇబ్బంది పెట్టాలనే చూస్తుంది. ఈ ప్రతికూల పరిస్థితుల్లో కూడా రాఘవ ఏడాదిపాలనను బాగానే లాక్కొచ్చాడని చెప్పొచ్చు. ఎక్కడా అవినీతికి ఆస్కారం లేదు. తెలుగుదేశంపార్టీ సభ్యులతో కూడా సమన్వయంగా వ్యవహరిస్తూ ప్రశాంతంగా సమావేశాలు జరుపుతున్నాడు. కొత్త జడ్పీ భవనాన్ని అందంగా తయారుచేసి ప్రారంభించడం, జడ్పీ అతిథిగృహాన్ని ఆధునీకరించడం వంటివేకాక జిల్లాలోని పలు జడ్పీ హైస్కూళ్లు, హాస్టళ్లలో వసతులు మెరుగుపరచడానికి కృషి చేస్తున్నారు. జడ్పీలో చాలినన్ని నిధులు లేకున్నా తనకు సాధ్యమైనంత స్థాయిలో అభివృద్ధి పనులు చేయడానికి శ్రమపడుతుండడం అభినందనీయం.

• ఆత్మకూరులో

# కేడర్‌కు లీడర్ కరువు

## కన్నబాబు పోకడలతో పార్టీకి చేటు





**జిల్లాలో తెలుగుదేశం పార్టీ బలహీనంగా వున్న నియోజక వర్గాలలో ఆత్మకూరు ఒకటి. కొమ్మి లక్ష్మయ్యనాయుడు వెళ్లిపోయాక ఇక్కడ పార్టీకి గట్టి నాయకుడు లేకుండాపోయాడు. ఏ చెట్టు లేని చోట ఆముదం చెట్టే మహావృక్షమన్నట్లు ఎవరూ లేకపోవడంతో ఎమ్మెల్యేకు తక్కువ సర్పంచ్‌కు ఎక్కువ అన్నట్లుండే గూటూరు కన్నబాబుకు ఆత్మకూరు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించారు.**

2014ఎన్నికల్లో ఆత్మకూరు నుండి గట్టి అభ్యర్థి కోసం ప్రయత్నించారు. ఆనం రామనారాయణరెడ్డి తెలుగుదేశంలో చేరుంటే అభ్యర్థి ఆయనే. కానీ, ఆయన కాంగ్రెస్‌లోనే ఉండి పోయాడు. చివరి ప్రయత్నంగా జిల్లా సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డిని లాగడానికి పాకులాడారు. ఆయన ఆరోజు ఆనంను వదలలేకపోయాడు. వీరిద్దరిలో ఎవరు తెలుగుదేశం అభ్యర్థి అయ్యున్నా ఆత్మకూరు పార్టీ పరిస్థితి ఇంకో విధంగా ఉండేది. కాని ఆరోజు వీళ్లు తెలుగుదేశంలోకి పోకపోవడంతో కన్నబాబుకే టిక్కెట్ ఇచ్చారు. దీంతో తెలుగుదేశంకు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కాంగ్రెస్ అభ్యర్థిగా వున్న ఆనం రామనారాయణరెడ్డి అసలు ఎలక్షన్‌నే వదిలేసాడు. దీంతో ఆత్మకూరులో వున్న కాంగ్రెస్ కేడర్ అంతా కూడా వైకాపాలో చేరడం, అసెంబ్లీలోనూ, పార్లమెంటులోనూ వైకాపా అభ్యర్థులకు ఇక్కడే భారీ మెజార్టీ రావడం జరిగింది. ఆత్మకూరులో వచ్చిన మెజార్టీతోనే ఎంపీగా మేకపాటి బయటపడ్డాడు. ఎన్నికల తర్వాత ఓడిపోయిన కన్నబాబునే ఇక్కడ టిడిపి పార్టీ ఇన్‌ఛార్జ్‌గా కొనసాగిస్తోంది. అయితే కన్నబాబు వ్యవహారశైలి ఇక్కడ కొందరికి నచ్చడం లేదు. అన్ని వర్గాలను కలుపుకుపోవడంలో ఆయన విఫలమవుతున్నాడు. కొంతకాలం క్రితం ఈ నియోజకవర్గానికే చెందిన మెట్టుకూరు ధనుంజయరెడ్డి తెలుగుదేశంలో చేరారు. నియోజకవర్గంలో పరిచయాలుండడం, వ్యక్తిగతంగా మంచి పేరుండడంతో ఆత్మకూరు నియోజకవర్గంలో కొందరు టిడిపి కార్యకర్తలు, నాయకులు ఆయనను అనుసరిస్తున్నారు. అయితే ఆయన ఎవరికీ పోటీగా వర్గ రాజకీయాలు నడపకుండా తన పని తాను చేసుకుంటున్నాడు. అయితే కన్నబాబు వాళ్లను కలుపుకుని పోకుండా పార్టీ కార్యక్రమాలకు వారిని దూరం పెడుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ నా ఒక్కడిదే అన్నట్లు కన్నబాబు వ్యవహరిస్తుండడం మిగతా వారికి నచ్చడం లేదు. కన్నబాబు వ్యవహారశైలి ఇలాగే వుంటే పార్టీకి చేటు తప్ప ప్రయోజనం వుండదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ప్రతి స్త్రీ ఒక శక్తిగా మారాలి



ప్రతి స్త్రీ ఒక శక్తిగా మారాలని తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సూచించారు. మహిళలపై నేరాలు రోజురోజుకు ఎక్కువవుతున్నాయని, వాటి నుంచి రక్షించుకునేందుకు మహిళలు ధైర్య సాహసాలు అలవర్చుకోవాలన్నారు. వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్, శక్తి అకాడమి ఆధ్వర్యంలో "స్త్రీల హక్కుల పరిరక్షణ – ఆత్మరక్షణ" కార్యక్రమం ద్వారా నాలుగురోజుల శిక్షణ కార్యక్రమాన్ని 24వ తేదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా నెల్లూరు మద్రాసు బస్టాండ్ వద్దనున్న సాంఘీక సంక్షేమ వసతి గృహ సముదాయ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని మానవహక్కుల సంఘం కార్యదర్శి సుబ్రహ్మణ్యం జెండా వూపి ప్రారంభించారు. ర్యాలీ అక్కడి నుండి నెహ్రూ బొమ్మ, విఆర్‌సి సెంటర్‌కు చేరుకుంది. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థినులతో మానవహారం ఏర్పాటు చేసారు. అనంతరం స్త్రీల హక్కుల పరిరక్షణకై నినాదాలు చేశారు. అనంతరం టౌన్‌హాల్లో ప్రారంభోత్సవ కార్యక్రమాలను సోమిరెడ్డి, సుబ్రహ్మణ్యం, వసంతలక్ష్మి తదితరులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సోమిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పాఠశాలలో కరాటే విద్యను తప్పనిసరి చేయాలని సూచించారు. మానవ హక్కుల కమిషనర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మహిళలకు స్వశక్తి అవసరమని, వారు తమ హక్కులు తెలుసుకోవాలన్నారు. వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్టు అధినేత్రి టి.వసంతలక్ష్మి మాట్లాడుతూ బస్సుల్లో, ఆటోల్లో ప్రయాణించే మహిళలకు రక్షణ లేదని, ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఆలోచించకుండా స్త్రీలు తమని తాము రక్షించుకునే దిశగా కృషి చేయడంలో భాగంగా శక్తి అకాడమీని స్థాపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్వచ్ఛంధ సంస్థల అధ్యక్షుడు ఇవియస్ నాయుడు, కరాటే మాస్టర్ సురేష్ పాల్గొన్నారు.

# అమాత్యులేరీ...?





# అభివృద్ధి జాడలేవి!

రాజకీయాల్లోనే కాదు, అభివృద్ధిలోనూ స్తబ్ధత నెలకొంది. రాష్ట్రంలో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. పుష్కరాలు, పట్టిసీమ, సింగపూర్ రాజధాని, చంద్రన్న సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా వంటివి తప్పితే ఈ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాల జోలికే పోవడం లేదు. గత నాలుగు దశాబ్దాల చరిత్రను పరిశీలిస్తే ఇంత దౌర్భాగ్యపు పరిస్థితి ఎప్పుడూ కనిపించదు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయింది. జిల్లా నుండి మంత్రిగా పి.నారాయణ ఉన్నారు. ఇన్‌ఛార్జ్ మంత్రిగా శిద్ధా రాఘవరావు వ్యవహరిస్తున్నారు. ఆయన ఇంతవరకు జిల్లాకు ఒకసారి వచ్చారు. జిల్లా మంత్రి నారాయణ సంగతి ఇక చెప్పక్కర్లేదు. ఆయన ఏ అర్థరాత్రి నెల్లూరొస్తాడో, ఏ తెల్లారుజామున వెళ్లిపోతాడో అంతుబట్టడం లేదు. ఆయన వచ్చిపోయేది వారి పార్టీ నాయకులే పత్రికల ద్వారా తెలుసుకుంటున్నారు.

గతంలో నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పరసా రత్నం, కలికి యానాదిరెడ్డి వంటి నాయకులను మంత్రులుగా చూసాం. హైదరాబాద్‌లో కంటే నెల్లూరుజిల్లాలో ఎక్కువ వుండడానికి ఇష్టపడేవాళ్లు. జిల్లాలో ప్రతి నియోజకవర్గం తిరిగేవాళ్లు. అన్ని ప్రాంతాల సమస్యలు తెలుసుకుంటుండేవాళ్లు. జిల్లా మొత్తం మీద వారికి ఒక అవగాహన ఉండేది. అభివృద్ధి పనుల పరంగా ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తుండేవాళ్లు. ఏ ప్రాంతానికి వెళ్లినా అభివృద్ధి పనులకు శంకుస్థాపనో, ప్రారంభోత్సవమో ఉండేది.

కాని ఈసారి మాత్రం జిల్లాలో మనకంటికి అలాంటివేవీ కనిపించడం లేదు. మంత్రిగా నారాయణ జిల్లాకు తెచ్చిన అభివృద్ధి పనంటూ ఏదీ లేదు. ఒక మీటరు డ్రైనేజీ లేదు, ఒక కిలోమీటర్ రోడ్డు కూడా శాంక్షన్ చేయించలేదు. ఈ జిల్లాకొక మంత్రి ఉన్నాడన్న ఫీలింగ్ లేకుండాపోయింది. గతంలో వేసవి కాలం వచ్చిందంటే జిల్లాలో సాగునీళ్లు, త్రాగునీళ్లు, రైతుల ఇబ్బందుల గురించి మంత్రులు పట్టించుకునే వాళ్లు. ఈ సమస్యలపై అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి పని చేసే వాళ్లు. ఇప్పుడు ఆ పద్ధతి పాడూ లేదు. జిల్లాను గాలికొదిలేసినట్లుగా వుంది పరిస్థితి.

# ఒక ప్రాణాన్ని నిలిపారు...



నెల్లూరుజిల్లా కోట మండలం, ఏఎస్ పురం గ్రామానికి చెందిన కె.వెంకటమ్మ దవడ ఎముక వద్ద తీవ్రమైన ఇబ్బందితో రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి వచ్చింది. ఆమెను సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వరరావు పరీక్షించి, దవడలో క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారించి అరుదైన శస్త్ర చికిత్స కాంప్లెక్స్ రీకన్‌స్ట్రక్టివ్ పద్ధతి ద్వారా నయం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ శస్త్ర చికిత్స అనంతరం వెంకటమ్మ ఆరోగ్యం పూర్తిగా కుదుటపడిందని, ఆమెకు మళ్లీ క్యాన్సర్ వచ్చే అవకాశం లేదన్నారు. క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను, రోగులకు అవసరమైన చికిత్సలకు రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి సేవలు ఉపయోగించుకోవాలన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# నెల్లూరు కబుర్లు

• 1వ తేదీ వచ్చేస్తోంది

## హెల్మెట్ ధారణకు సిద్ధం కండి




ద్విచక్ర వాహనదారులు ఆగష్టు 1వ తేదీ నుండి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనే నిబంధన అమలులోకి రానుంది. జూలై 1వ తేదీ నుండే ప్రభుత్వం ఈ నిబంధనను అమలు చేయాలను కున్నప్పటికి గోదావరి పుష్కరాల హడావిడితో ఒక నెల పొడిగించింది. ఆగష్టు 1 నుండి ఖచ్చి తంగా అమలు చేయడానికి శ్రీకారం చుట్టారు. అలాగే కారులో సీటు బెల్టు పెట్టుకోవడాన్ని కూడా తప్పనిసరి చేసారు. తలకు హెల్మెట్‌లు లేకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాలలో ద్విచక్ర వాహనదారులు మరణిస్తున్నారు. మహానగరాలలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్న నిబంధన ఎప్పటి నుండో అమలులో వుంది. రోడ్డు ప్రమాదాలలో మరణాలను తగ్గించడానికి ఈ నిబంధనను రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి తెచ్చారు. అయితే బైక్‌లో వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలనే నిబంధన వుంది. అయితే ఎప్పుడు ఎవరు వెనుక కూర్చుంటారో తెలియదు. అంటే ప్రతి ద్విచక్రవాహన దారుడు రెండు హెల్మెట్లను కలిగి వుండాలి. ఇది కొంచెం ఇబ్బంది కరం. వెనుక కూర్చున్నవారికి హెల్మెట్ పెట్టుకోవాలన్న నిబంధనను మినహాయించాలని వాహనదారులు కోరుతున్నారు. 1వ తేదీ నుండి హెల్మెట్ లేకుంటే వెయ్యి రూపాయలు ఫైన్ వేయనున్నారు.

## కొత్త ఆర్ఐఓ జాకబ్

నెల్లూరుజిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారిగా బాబూ జాకబ్‌ను నియమిస్తూ ఇంటర్ బోర్డు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసారు. ఇక్కడ ఆర్ఐఓగా వున్న పరంధామయ్య ఆర్‌జెడిగా పదోన్నతిపై గుంటూరుకు బదిలీ కావడం తెలిసిందే! ఆయన స్థానంలో జిల్లా వృత్తి విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న బాబూ జాకబ్‌ను నియమించారు. కోట మండలం కొక్కుపాడు గ్రామానికి చెందిన జాకబ్ కెమిస్ట్రీ లెక్చరర్‌గా పాతికేళ్ళ పని చేశారు. 2006 నుండి ప్రిన్సిపాల్‌గా వున్నారు. 2013జూలై నుండి వృత్తి విద్యాశాఖాధి కారిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

## స్పాస్టిక్ సెంటర్‌లో అన్నదానం



నెల్లూరు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి ఆధ్వర్యంలో కొనసాగుతున్న మాగుంట సుబ్బరామరెడ్డి మానసిక వికలాంగుల పాఠశాలలో సోమ వారం షేక్ అబ్దుల్ ఫహీం పాప ఇష్రత్ జహా జన్మదినం సందర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్ర మంలో జిల్లా మైనారిటీ నాయకులు షేక్ ఖాజావలి, చిరంజీవి ఐ బ్యాంకు అధ్యక్షులు వివి సుధీర్, షేక్ ఆరిఫ్, షేక్ ఆయేషా, సయ్యద్ హమ్జా నవాజ్, ప్రిన్సిపల్ జి.మాధురి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ఇంటర్, ఆపైన ఉన్నత చదువులు చదువుకునే 30మంది విద్యార్థులకు రూ. 2వేలు వంతున నగదు బహుమతులను నెల్లూరుజిల్లా గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గ్రోసు గోపాలయ్య అందజేశారు. ఆదివారం నెల్లూరు మినీ బైపాస్‌రోడ్డులోని పరమేశ్వరి మహేశ్వరి కల్యాణ మండపంలో నిర్వహించిన గాండ్ల తెలికుల సంక్షేమ సంఘ సమావేశంలో గోపాలయ్య మాట్లాడుతూ ఐక్యతతో కులస్థులందరూ సహకరిస్తే పేదరికంలో




ఉన్నవారు ఆర్థిక ఇబ్బందులను అధిగ మించి అత్యున్నత స్థాయికి చేరుతారన్నారు. మురళీకృష్ణ హోటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ వీరిశెట్టి హజరత్‌బాబు మాట్లాడుతూ తమ కుల గురువైన ఎస్వీ సాంబమూర్తి విగ్రహ ప్రతిష్ఠాపనకు కులస్థులందరూ సహకరిం చాలని కోరారు. అనంతరం గాండ్ల తెలి కుల వధూవరుల వివాహ పరిచయవేదిక కార్యక్రమంలో 162మంది వధూవరులు పాల్గొని తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి హరగోపాల్, గిద్దలూరు ప్రభాకరరావు, వరిగొండ సురేష్‌బాబు, చిట్టెంశెట్టి సుధాకర్ తది తరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీకి ఆదాయం

గత రెండేళ్లలో విభజన ఉద్యమాలు, సమైక్య ఆందోళనలు, సమ్మెలతో ఆర్టీసీ బాగా నష్టపోయింది. ఆ నష్టాన్ని పూడ్చడం ఎవరి తరమూ కాదు. కాని గుడ్డిలో మెల్ల అన్నట్లుగా గోదావరి పుష్కరాల పుణ్యమా అని నెల్లూరు ఆర్టీసీ రీజియన్‌కు 80లక్షల రూపాయల ఆదాయం వచ్చింది. జూలై 14నుండి 25వరకు ప్రత్యేక బస్సులను నడపగా 80లక్షలు వచ్చింది.

## ప్రతి నెలా సరుకులు

తెల్లరేషన్ కార్డుదారులకు ప్రతినెల చౌకదుకాణాల ద్వారా 50రూపాయలకు కిలో కందిపప్పు, 7రూపాయలకు కిలో గోధుమలు, 1650రూపాయలకు కిలో గోధుమపిండిని సరఫరా చేస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ కొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

## చౌకగా ఎర్రగడ్డలు

బజార్లో కిలో ఉల్లిపాయలు రూ.30 నుంచి రూ.40 దాకా అమ్ముతున్నారు. రోజురోజుకు వీటి ధర పెరుగుతూ పోతోంది. ఈ ధరలకు కళ్లెం వేసి అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ఉల్లిపాయల ధరలను తగ్గించాలని నిర్ణయించింది. ఈమేరకు రైతుబజార్లో కిలో ఉల్లిపాయలు రూ.20కే విక్రయించేందుకు నిర్ణయం తీసుకుందని జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ తెలిపారు.

## సింహపురిని హరితవనంగా మారుద్దాం

------------------ నగర కమిషనర్ పివివియస్ మూర్తి

సింహపురిని హరితవనంగా మారుద్దామని, అందుకు నగర కార్పొరేటర్లందరూ సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పివివియస్ మూర్తి పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు నగరం 14వ డివిజన్ ఏసి నగర్ మెయిన్‌రోడ్డు నుంచి ఎస్వీజిఎస్ కళాశాల వరకు రోడ్ల ప్రక్కన మొక్కలు నాటి పుష్కరవనోత్సవం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కమిషనర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తలపెట్టిన నీరు-చెట్టు, పుష్కర వనోత్సవం కార్యక్రమాలను నగరమంతా విస్తరిస్తే నెల్లూరు పచ్చ దనంతో కళకళలాడుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, స్థానికులు పాల్గొన్నారు.

## సిఏ ఫైనల్ టాపర్ లోకేష్



నెల్లూరుకు చెందిన బెజ్జం లోకేష్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా సిఏ ఫైనల్ ఫలితాలలో 38వ ర్యాంకు సాధించాడు. లోకేష్ తండ్రి ప్రైవేట్ విద్యాసంస్థలో ఇంగ్లీష్ లెక్చరర్ కాగా తల్లి గృహిణి. సిఏ ఫలితాల్లో ర్యాంకు సాధించిన లోకేష్‌కు లాయర్ అభినందనలు.

## ఏసి వాకర్స్ నోటు పుస్తకాల పంపిణీ



నెల్లూరు ఏసి కూర గాయల మార్కెట్ ప్రక్కన ఉన్న సుంకు చెంగన్న నగర పాలక సంస్థ ఉన్నత పాఠ శాలలోని విద్యార్థులకు ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సేవా కార్య క్రమాల్లో భాగంగా సోమ వారం నోటుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి శేషగిరిరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులు నోటుపుస్తకాలు కొనలేక చదువులకు దూరమవుతున్నారని, వారికి తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగదీశ్వరరావు, అసోసియేషన్ సభ్యులు సత్యనారాయణ, నలుబోలు బలరామయ్య నాయుడు, బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి

- ఏపి ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు



ఆర్యవైశ్యులు వ్యాపారాలకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో తమ ప్రాతినిధ్యం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు జయంతి వెంకటే శ్వర్లు అన్నారు. నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట లోని శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం జరిగిన అర్బన్ ఆర్యవైశ్య సంఘ కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదిగితేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. విజయ వాడలో ఏపి ఆర్యవైశ్య మహాసభ కార్యా లయాన్ని నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగు తున్నాయన్నారు. ఐక్యతతో ఆర్యవైశ్యులు సంఘపటిష్టతకు, సమాజసేవకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం అర్బన్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా ముక్కాల ద్వారకానాథ్, ప్రధానకార్య దర్శిగా షరాబు సుబ్రహ్మణ్యం, కోశాధికా రిగా పబ్బిశెట్టి శ్రీనివాసులు, మహిళా విభాగ్ అధ్యక్షురాలిగా చీతిరాల పద్మావతి, ప్రధానకార్యదర్శిగా చలువాది ఉమారాణి, కోశాధికారిగా దుగ్గిశెట్టి సుధారాణి, యువజన విభాగ్ అధ్యక్షుడిగా పేరూరి ప్రదీప్, ప్రధాన కార్యదర్శిగా తిరివీధి కిషోర్‌కుమార్, కోశాధికారిగా బూర్లె జనార్ధన్, విద్యార్థి విభాగం అధ్యక్షుడుగా పబ్బిశెట్టి కళ్యాణ్‌కృష్ణ, కోశాధికారిగా అమరా విక్రమ్‌లు ప్రమాణస్వీకారం చేసారు. వీరితోపాటు కార్యనిర్వాహక కమిటి, సభ్యుల అభివృద్ధి కమిటి, కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేసారు. నూతన అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షు డిగా ప్రమాణం చేసిన ముక్కాల ద్వారకా నాథ్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభ్యున్న తికి ఎల్లవేళలా కట్టుబడి వుంటానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు తంగుటూరి రామ కృష్ణ, ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు యిమ్మడిశెట్టి కోటేశ్వరరావు, ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి పెరుమాళ్ల కాశీ రావు, అసోసియేట్ జనరల్ సెక్రటరి తిరివీధి ప్రకాశరావు, పొలిటికల్ కమిటి ఛైర్మెన్ కోట సత్యనారాయణ, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ చీఫ్ ఆర్గనైజర్ శేగు షణ్ముఖరావు, మాజీఅధ్యక్షుడు కోట గురు బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్యం

నెల్లూరుజిల్లాలోని వైద్యఆరోగ్యశాఖ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ భారతిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లాలోని ఆరోగ్య విస్తరణాధికారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గర్భవతుల్లో రక్తహీనతలను గుర్తించి వారికి తగిన సేవలు అందించాలన్నారు. మాతా శిశు మరణాలు నివారిం చేందుకు ప్రతి గర్భవతికి ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిడి అధికారి రవీంద్రారెడ్డి, డాక్టర్ సాగర్, డిఐఓ జయసింహా తదితరులు పాల్గొన్నారు.



# కలెక్టర్ ఆఫీసు ముందు కూర్చుంటా!

నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి జూలై 28వతేదీ రూరల్ మండలం లోని నారాయణరెడ్డిపేట, కోడూరుపాడు ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి చేనేత కార్మికులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. మూడేళ్ల క్రితం నిరుపేద ప్రజలకు ఇళ్లపట్టాలిచ్చారు. ఇంతవరకు అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించలేదు. లబ్దిదారులు మాత్రం అద్దె ఇళ్లల్లో ఉంటున్నారు. అక్కడ రోడ్లు, నీళ్లు, డ్రైనేజీ, లైటింగ్ వంటి వసతులు కల్పిస్తే వారికి ఈ బాడుగలు కట్టే బాధలు తప్పుతాయి. అధికారులు స్పందించి వారికి మౌలిక వసతులు కల్పించకుంటే కలెక్టర్ కార్యాలయం మెట్లపై కూర్చుని నిరవధిక ధర్నాకు దిగుతామని కోటంరెడ్డి హెచ్చరించారు. కోడూరు పాడులో 350మందికి ఇళ్ల పట్టాలిచ్చివున్నారని, వెంటనే అక్కడ మౌలిక వసతుల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట 1వ డివిజన్ కార్పొరేటర్ లేబూరు పరమేశ్వర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

# సీఎం హామీల అమలుకు శ్రీకారం

**- కలెక్టర్**

జిల్లాలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుట్టినట్లు జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి తెలిపారు. మంగళ వారం ఆమె తన ఛాంబర్‌లో సీఎం హామీల అమలుకు సంబంధించి అధికారులతో సమీక్ష జరిపారు. చేనేత కార్మికులకు సంబంధించి టెక్స్‌టైల్స్ పార్క్ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయండి, నెల్లూరు-మైపాడు రోడ్డును నాలుగులైన్లుగా మార్చేందుకు, మైపాడు, కొత్తకోడూరు బీచ్‌లను అభివృద్ధి చేసేందుకు ఆర్ అండ్ బి మరియు పర్యాటక శాఖాధికారుల సమన్వయంతో ప్రణాళికలు రూపొందించండి, గూడూరు నుండి విద్యానగర్ మీదుగా నాయుడుపేట వరకు విస్తరించే రోడ్డును త్వరగా పూర్తి చేయాలి. సోమశిల - స్వర్ణముఖి లింకు కెనాల్ పనులను పెండింగ్ లేకుండా చేప ట్టాలి. పెన్నా డెల్టా ఆధునీకరణ పనులను పటిష్టంగా నిర్వహించాలి. కావలి, ఉదయ గిరి, ఆత్మకూరులలో మంజూరు చేసిన



మినీ స్టేడియాల నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపాలని ఆమె సూచించారు.

ఈ సమావేశంలో సిపిఓ వెంకయ్య, డిఎస్ఓ ధర్మారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ రామిరెడ్డి, గూడూరు సబ్‌కలెక్టర్ పి.ఎస్. గిరీషా, ఆర్ అండ్ బి ఎస్ఇ విజయ్ కుమార్, నెల్లూరు, కావలి ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, నరసింహన్, టూరిజం అధికారి సిహెచ్ నాగభూషణం, చేనేత, జౌళిశాఖ ఏడి యం.బాబ్జిరావు, సంబం ధిత అధికారులు పాల్గొన్నారు.

# చెంగాళమ్మకు విజయేంద్రుని పూజలు



భక్తుల పాలిట కల్పవల్లిగా నిలచిన చల్లని తల్లి శ్రీ చెంగాళ పరమేశ్వరిదేవికి కంచికామకోటి పీఠాధిపతులు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతిస్వామి ప్రత్యేక పూజలు చేశారు. జూలై 25న విజయేంద్ర సరస్వతి స్వామీజీ సూళ్ళూరుపేటకు విచ్చేసి, అమ్మ వారి ఆలయాన్ని సందర్శించి పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మెన్ ఇసనాక హర్షవర్దన్‌రెడ్డి, ఇ.ఓ శ్రీనివాసులురెడ్డి స్వామీజీకి స్వాగతం పలికి ఆలయంలోనికి ఆహ్వానించారు. ఆలయ మర్యాదలతో ఆలయ అర్చకులు స్వామీజీని స్వాగతించారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**--- డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ ---**

ప్రభుత్వం ప్రజల కోసం చేపడుతున్న వివిధ పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని, పార్టీని బలోపేతం చేసేందుకు అందరూ కృషి చేయాలని రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. డిప్యూటీ స్పీకర్ జూలై 25న నెల్లూరుకు విచ్చేయగా, స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద జిల్లా టిడిపి అధ్యక్షుడు బీద రవిచంద్ర పర్యవేక్షణలో, తెలుగు యువత నాయకులు కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీద రవిచంద్ర, మండలి బుద్ధప్రసాద్‌తో జిల్లాకు సంబంధించి పలు విషయాలను చర్చించారు. పార్టీని మరింత పటిష్టవంతం చేసేందుకు కృషి చేస్తున్నామని, ప్రభుత్వ కార్యక్రమాలను, ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజెప్పేందుకు పార్టీతో పాటు, తెలుగు యువత గట్టి కృషి చేస్తోందని బీద రవిచంద్ర డిప్యూటీ స్పీకర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చాట్ల నరసింహారావు, గిరినాయుడు, తెలుగు యువత జిల్లా నాయకులు శింగంశెట్టి రవిచంద్ర, పి. రమేష్, కె.ప్రసాద్‌రెడ్డి, ఎన్.మురళీకృష్ణ సిహెచ్ రమేష్, వి.రవి, జె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# నీటి సమస్య రాకుండా చర్యలు!



తన నివాసంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పొనకా దేవసేన, హాజరైన కౌన్సిలర్లు

గూడూరు పట్టణంలో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చైర్ పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. పట్ట ణంలో నీటి ఎద్దడి ఉండటంతో సమీపం లోని వేములపాళెం వద్దనున్న నీటి పంపింగ్ ప్రాంతాన్ని ఆమె సోమవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 24గంటలు పంపింగ్ జరిగేలా చేస్తున్నా మని, మరమ్మతులకు గురైన మోటార్లను బాగు చేయిస్తామన్నారు. ఏ వార్డు నుంచి నీటి ఫిర్యాదు రాకుండా చూడటమే తమ లక్ష్యమన్నారు. క్లోరినేషన్ జరిగే తీరును, రికార్డులను పరిశీలించారు. తరచూ తని ఖీలు చేస్తామని, సిబ్బంది నిర్లక్ష్యం వహించ రాదని, పరిశుభ్రతను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నాయ కులు మనపాటి రవీంద్రబాబు, కౌన్సిలర్లు భాను, మురళీ, గోవిందు మస్తానమ్మ, రాజేశ్వరమ్మ, గుండాల భారతి, షంషీర్, నేరెళ్ళ సుబ్బమ్మ, బిల్లు చెంచురామయ్య, ముప్పాల లక్ష్మి, బండి విజయమ్మ, కోడిపర్తి కల్పన, మాజీకౌన్సిలర్ నేరెళ్ళ వెంకట రత్నం, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## సునీతా సేవా సంస్థ కార్యాలయంలో

# క్యాన్సర్‌పై అవగాహన

గూడూరులోని సునీతా సేవా సంస్థ కార్యాలయంలో ఇటీవల క్యాన్సర్ వ్యాధిపై మహిళలకు 4వ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండి యన్ రెడ్‌క్రాస్ సొసైటీ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యాధికారి లక్ష్మి పాల్గొని మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై అప్రమత్తత ఎంతో అవ సరమన్నారు. జీవన విధానం లోపం వల్లే క్యాన్సర్ బారిన పడతారన్నారు. ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే నివారించ వచ్చన్నారు. మానని పుండ్లు, నొప్పిలేని గడ్డలు, శరీరంపై పుట్టుమచ్చల్లో మార్పులు క్యాన్సర్‌కు సూచనలన్నారు. మహిళల్లో వచ్చే గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్,



మాట్లాడుతున్న వైద్యురాలు లక్ష్మి, ప్రక్కన సారంగం శ్రీనివాసులు తదితరులు

ఇతర రకాల క్యాన్సర్‌పై అవగాహన కలి గించి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భారతి, ఆ సంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సారంగం లక్ష్మి, ఆసుపత్రి సిబ్బంది, మహిళలు, డాక్టర్లు పాల్గొన్నారు.

# విద్యార్థులకు లయన్స్‌క్లబ్ స్కూల్ బ్యాగులు



స్కూలు బ్యాగులు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ దేవసేన

గూడూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల ఎస్ఎం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూలు బ్యాగులు చైర్‌పర్సన్ పొనకా దేవసేన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠ శాలలో మంచి ఉత్తీర్ణత శాతం వస్తే ఆ పాఠశాలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు వస్తుందన్నారు. విద్యార్థులను సమాజం గర్వించేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. తల్లి దండ్రులు తమ పిల్లలను చదువుపట్ల ఆసక్తి కలిగించేలా ప్రోత్సహించాలన్నారు. మంచి చదువులు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగిన వారిని ఆదర్శంగా తీసుకోవా లన్నారు. అనంతరం లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు, తోట సురేష్‌నాయుడు, నీలకంఠం నవీన్ జయ కుమార్, కడివేటి చంద్రశేఖర్‌లు మాట్లా డుతూ విద్యాభివృద్ధికి, వైద్య రంగానికి విశేష సేవలు అందించేందుకు ప్రణాళి కలు రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ రియాజ్ అహ్మద్, సోమిశెట్టి చెంచురామయ్య, కౌన్సిలర్ పి.శ్రీదేవి, రావ్మోహన్, హెచ్ఎం సులేఖ, ఎం.వి.రమణయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కోమలికి దాతల ఆర్థిక సాయం

ఎన్‌సిఇఆర్‌టీకి సంబంధించి మైసూర్ లోని ఆర్ఐఈ కళాశాలలో సీటు సాధించిన కోమలి అనే గిరిజన విద్యార్థినికి దాతలు ఇచ్చిన ఆర్థికసాయాన్ని డిఎస్పీ బి.శ్రీనివాస్ ఆదివారం తన కార్యాలయంలో అందజేశారు. కళాశాల ఫీజు కింద రూ.35వేలు చెల్లించాల్సి ఉండగా ఆర్థిక స్థోమత లేకపోవడంతో తండ్రి అనారోగ్యంతో బాధపడుతూ తమ సంస్థను సంప్రదించారని ఏఆర్డీ స్వచ్ఛంధ సంస్థ డైరెక్టర్ బషీర్ తెలిపారు. దీంతో సంస్థ తరపున రూ.10వేలు, ప్రముఖ పారిశ్రా మికవేత్త నానాజీ రూ.15వేలు, సాయి సత్సంగ సేవా సమితి నిర్వాహకులు కోట సునీల్‌కుమార్ రూ.10వేలు ఆర్థిక సాయం చేశారని



కోమలికి నగదు అందిస్తున్న డిఎస్పీ బి.శ్రీనివాస్, ప్రక్కన బషీర్

తెలిపారు. ఈ మొత్తాన్ని డిఎస్పీ చేతులమీదుగా అందించామని చెప్పారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## సబ్‌కలెక్టర్‌గా శ్రీగిరీష



గూడూరు ఆర్డీవో జి.రవీందర్ సోమవారం బదిలీ అయ్యారు. గూడూరు సబ్‌కలెక్టర్‌గా శ్రీగిరీష పిఎస్ అనే యువ ఐఏఎస్ అధికారి నియమితులయ్యారు. ఈయన 2012వ బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఇక్కడ వున్న ఆర్డీవో హైదరాబాద్‌లో రిపోర్టు చేసుకోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. గూడూరు సబ్‌కలెక్టర్‌గా శ్రీగిరీష పిఎస్ మంగళవారం నాడు బాధ్యతలు స్వీకరించారు. ఈయన అస్సాంలో అసిస్టెంట్ కలెక్టర్‌గా పని చేశారు. ఆర్డీవో రవీందర్, గూడూరు తహశీల్దార్ సి.వెంకటనారాయణమ్మ, సబ్ కలెక్టర్ ఆఫీసు ఏఓ గీతావాణి, వీఆర్వోలు జి.రమణయ్య, నాగార్జునరెడ్డి, తదితర అధికారులు, అరవ పార్వతయ్య తదితరులు గిరీషను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రయాణీకులకు మెరుగైన సేవలందిస్తాం

----------------రైల్వేస్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు

రైలు ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించడమే తన లక్ష్యమని గూడూరు రైల్వేస్టేషన్ మేనేజర్ పి.వెంక టేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. స్టేషన్లో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తామన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. స్టేషన్ అభివృద్ధికి తోటి ఉద్యోగులు, ప్రయాణీకులు, స్థానికులు సహక రించాలన్నారు.



## పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్‌గా విజయకుమార్



గూడూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వి.విజయకుమార్ నియమితులయ్యారు. కందుకూరు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న ఆయన 9నెలలు గూడూరు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం గూడూరుకే ఆయనను బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

## కౌన్సిలర్ల సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధి

గూడూరు మున్సిపల్ కౌన్సిలర్ల సహకారంతో గూడూరు పట్టణాన్ని అభివృద్ధి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ పొనకా దేవసేన అన్నారు. ఇటీవల స్థానిక టవర్‌క్లాక్ వద్ద క్యుబొటా మినీఎక్స్‌లేటర్ల పనితీరును ఆమె పరిశీలించిన సంద ర్భంగా మాట్లాడుతూ ఎక్స్‌లేటర్‌ను ఉచిత డెమో నిర్వహించారన్నారు. దీని ద్వారా త్వరితగతిన కాలువలలో పూడి కను, మురుగును తొలగించేందుకు వీలుం టుందన్నారు. పైపుల నిర్మాణం తదితర పనులను ఈ వాహనాల ద్వారా వేగ వంతంగా చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, ఎంబేటి చంద్రయ్య, గిరిబాబు, షంషీర్, లక్ష్మి, శ్రీదేవి, మాజీకౌన్సిలర్ రత్నయ్య, నాయకులు శ్రీధర్, గురవయ్య పరమేశ్వరరావు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



ఎక్స్‌లేటర్ నడుపుతున్న చైర్‌పర్సన్ దేవసేన

## ఇతర డిపో బస్సులు వచ్చేలా చూడండి

గూడూరు ఆర్టీసీ డిపోలోకి ఇతర డిపోల బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలుగుదేశంపార్టీ గూడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాధాజ్యోత్స్నలత స్థానిక డిపో మేనేజర్ అనిల్‌కుమార్‌ను కోరారు. సోమవారం ఆమె ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కలిశారు. గూడూరు మండలంలోని పలు గ్రామాలకు బస్సులు రావడం లేదని తన దృష్టికి వచ్చిందని, వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు. గూడూరులోని రోడ్లు భవనాల అతిథిగృహంలో తెలుగుదేశం కార్యకర్తల నుంచి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. వైస్‌ఛైర్మన్ శీలం కిరణ్‌కుమార్, తెలుగుదేశంపార్టీ నాయకులు చేవూరు విజయమోహన్‌రెడ్డి, కోటారెడ్డి, నరసింహులు, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

శుభకార్య ప్రయత్నాలు అనుకూలించగలవు. సొంత పనులకు ఆటంకాలు కలుగవచ్చును. ఉద్యోగులకు పని భారం పెరుగుతుంది. కొనుగోలుదారులను ఆకట్టుకుంటారు. స్థిరాస్తుల క్రయవిక్రయావకాశాలు లభిస్తాయి. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభించగలవు. ఆరోగ్యం కాపాడుకోవడానికి శ్రద్ధ అవసరం. శుభవార్త వింటారు. ప్రముఖులను కలుసుకొంటారు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

చేపట్టిన పనులందు టెన్షన్ ఎక్కువగా ఉండినా సవ్యంగానే సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో మార్పులు జరిపి ఆదాయము పెరుగుదలకు కృషి చేస్తారు. పొదుపు పథకాలలో భాగస్వాములు కాగలరు. ఆర్థికాభివృద్ధి అవకాశాలు లభించగలవు. ఆరోగ్యం బాగుంటుంది. సోదరవర్గానికి మేలు జరుగుతుంది. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. షేర్లు లాభసాటిగా ఉండగలవు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ప్రభుత్వ పరంగా అనుమతులు ఆలస్యం కావడం, కోర్టు కేసులు వాయిదా పడవచ్చును. వ్యాపార రంగాలలో పోటీ పెరగడం, మంచి వ్యాపార అవకాశాలు చేజారడం, సామాన్య ఆదాయం ఈ వారం విశేషాలు. అదనపు ఖర్చులున్నా ఇబ్బందులుండకపోవచ్చును. చేపట్టిన పనులు ఆలస్యం కావడం, మార్పులుండటం జరుగుతుంది. ఆర్థిక లావాదేవీలందు తొందరపాటు తగదు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

శుభవార్తలు వింటారు. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతాయి. మిత్రుల సహకారం బాగుంటుంది. ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. పన్నులు, చెల్లింపులు సకాలంలో చెల్లిస్తారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి, ఆదాయం బాగుంటుంది. వ్యవహారాలలో జాగ్రత్త అవసరం. ముఖ్య పత్రాలు అందుతాయి. ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం.



### బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 31.07.2015 నుండి
తేది. 06.08.2015 వరకు

ఈ వారం మీనంలో కేతువు, మకర కుంభ మీన మేష రాశులలో చంద్రుడు, కర్కాటకంలో రవికుజబుధులు, 4తేది సింహంలో బుధుడు, సింహంలో గురు శుక్రులు, కన్యలో రాహువు, వృశ్చికరాశిలో శని సంచరించుదురు.

**పంచాంగము:**

తేది 31 శుక్రవారము వ్యాసపూర్ణిమ

**నిజాషాఢ మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 31 | శుక్ర | పూర్ణిమ | సా॥ గం.4.55వ॥ |
| తేది. 01 | శని | పాడ్యమి | సా॥ గం.3.01వ॥ |
| తేది. 02 | ఆది | విదియ | ప॥ గం.12.56వ॥ |
| తేది. 03 | సోమ | తదియ | ఉ॥ గం.10.32వ॥ |
| తేది. 04 | మంగళ | చతుర్థి | ఉ॥ గం.8.05వ॥ |
| | పిదప | పంచమి | రా॥ గం.5.35వ॥ |
| తేది. 05 | బుధ | షష్ఠి | రా॥ గం.3.10వ॥ |
| తేది. 06 | గురు | సప్తమి | రా॥ గం.12.53వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆదాయము సామాన్యం. చేపట్టిన పనులందు ఇబ్బందులను అధిగమిస్తారు. రావలసిన బాకీలు కొంత అందగలవు. కొత్త ఆర్థిక ఒప్పందాలు, వ్యాపార పెట్టుబడులకు నిర్ణయాలు వాయిదా వేసికొనడం మంచిది. ఇతరులు మిమ్మల్ని విమర్శించే అవకాశమున్నది. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. కోర్టు కేసులందు అనుకూలత కలదు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కుటుంబ సౌఖ్యము బాగుంటుంది. గృహ రిపేర్లుండవచ్చును. కొత్త వస్తువులు సమకూర్చుకొంటారు. ఆర్థిక ఇబ్బందులు క్రమంగా సర్దుబాటు కాగలవు. వృత్తి వ్యాపారాలలో ప్రోత్సాహం బాగుండి ఆదాయం పెరుగుతుంది. వివాదాలు సర్దుబాటు కాగలవు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. ఉద్యోగులకు స్థాన మార్పులు, అదనపు బాధ్యతలుంటాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

బిడ్డలకు ఉన్నత విద్యావకాశాలు దొరకడం, శుభ కార్యాల నిర్ణయాలు జరగవచ్చును. బాధ్యతలను స్వయంగా చూచుకొనాలి. వృత్తి వ్యాపారాలలో నిలద్రొక్కుకుంటారు. ఆదాయము బాగుండినా ఖర్చులు అదనంగా పైనబడగలవు. చేపట్టిన పనులను లోతుగా ఆలోచించి నిర్వహించండి. స్థిరాస్తుల వ్యవహారాలు పరిష్కారానికి వస్తాయి.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

జీవిత భాగస్వామితో ఆలోచనలు చేసి కృషిని గూర్చి చర్చించడం మంచిది. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. వ్యాపార వర్గాలలో ఆదాయం సరిగా ఉండక నిరుత్సాహ పడతారు. వృత్తి జీవనము కలవారికి ప్రోత్సాహం బాగుండి రాబడి స్వల్పంగా పెరుగుతుంది. రావలసిన బాకీలు నిలబడిపోతాయి. స్థిరాస్తుల లావాదేవీలందు తొందరపడవద్దు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఉద్యోగులు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. నిరుద్యోగులకు అవకాశాలు దొరకగలవు. నూతన వస్తువులను సమకూర్చుకొంటారు. మీ మాటకు సలహాలకు విలువ బాగుంటుంది. ఖర్చులు అధికంగా ఉంటాయి. అయితే ప్రయోజనకరంగా ఉంటాయి. వ్యాపారాలలో కొత్త ఆలోచనలు పథకాలతో ముందుకు సాగుతారు. వృత్తి జీవనం కలవారికి ఆదాయం పెరుగుతుంది. మీ ఆరోగ్యం బాగుంటుంది.


## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

భాగస్వామిక చర్చలు, సభ్యులుగా గల సంఘ కమిటీల చర్చలందు ప్రాముఖ్యత ఉంటుంది. ముఖ్య విషయాలలో కుటుంబ సభ్యుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొనండి. వృత్తి వ్యాపారాలలో పురోభివృద్ధి, రాబడి పెరుగుతుంది. అదనపు ఖర్చులుండినా ఇబ్బందులుండవు. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత కలదు. ఉన్నత విద్యావకాశాలు అందుకొనగలరు.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఇతరులతో ఉన్న విభేదాలు సర్దుబాటు కాగలవు. బిడ్డల ఉన్నత విద్యావకాశాలు, వివాహాది ప్రయత్నాలు ఫలించవచ్చును. హామీలు ఇవ్వడం, అప్పులివ్వడం చేయకండి. ఆస్తి, భూములకు చెందిన సమస్యలు పరిష్కారానికి రాగలవు. వృత్తి వ్యాపారాలలో ఆదాయవృద్ధి, వ్యాపార ఇబ్బందులు తొలగడం ఉంటుంది. అనుకున్న పనులు సవ్యంగా జరిగిపోతాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

టెన్షన్ ఎక్కువగా ఉన్నా అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. ముఖ్యమైన అనుమతులు, పత్రాలు అందుకొంటారు. అధికారులకు అదనపు బాధ్యతలు, స్థాన చలనాలుండగలవు. ఉద్యోగ ప్రయత్నాలు చేసే వారికి అనుకూలత బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో క్రమేణా అభివృద్ధి ఆదాయం పెరుగుదల ఉంటుంది. కుటుంబ సౌఖ్యము బాగుంటుంది.

# రాజమండ్రి నుండి విజయవాడకు...

శ్రీను గల్పిక

అది 4కోట్ల 80లక్షల మంది భక్తులు పుష్కరస్నానం ఆచరించిన గోదావరి నది ప్రవహించే రాజమహేంద్రవరం. జూలై 24వ తేదీ. పుష్కరాల ముగింపురోజు గెస్ట్ హౌస్‌లో హైటెక్ రత్న, పుష్కరబ్రహ్మ చంద్రబాబు ప్రెస్‌మీట్... ఈరోజే గోదావరి పుష్కరాల చివరిరోజు... ఆంధ్రప్రదేశ్‌లో వున్న ప్రతి ఒక్కరూ సాయంత్రం తమ ఇళ్లల్లో దీపారాధనలు చేయండి, ఇళ్ల ముందు చలువ పందిర్లు వేయండి, అలాగే ముగ్గులు పెట్టండి, నాలుగైదు రకాల ప్రసాదాలు చేసి దేవుళ్లకు పెట్టండి, ప్రతి గ్రామంలోనూ పాటకచేరీలు, డ్యాన్స్‌లు, హరికథలు, పౌరాణిక నాటికలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయండి అని చెప్పాడు.

★★★★★

చంద్రబాబు స్టేట్‌మెంట్‌పై 'అఘోరా9×9' టీవీ చర్చా వేదికను పెట్టింది. ఆస్తికవాదుల నుండి పూర్ణానందశాస్త్రి, నాస్తిక వాదుల నుండి గోరా గోపాల్, తెలుగుదేశం నుండి మంత్రి నారాయణ, వైకాపా నుండి అంబటి రాంబాబులు పాల్గొన్నారు. ఛానెల్ ప్రతినిధి గ్యాస్ గన్నారావు చర్చను ప్రారంభిస్తూ... మీరు చెప్పండి గోరా గోపాల్‌గారు, చంద్రబాబుగారు ఈ పుష్కరాలు నిర్వహించిన తీరుపై మీ స్పందనేంటని అడిగాడు. గోరా గోపాల్ స్పందిస్తూ... నా దృష్టిలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా కంటే ఏదన్నా టెంపుల్‌కు ఇఓగా వుంటే బెటర్ అనిపిస్తుంది. సీఎం అయ్యుండి 12రోజులు పరిపాలన వదిలేసి పుష్కరాలను పర్యవేక్షించడమేమిటి? లౌకిక విలువలకే విరుద్ధం. గోదావరిలో మునిగితే పుణ్యం వస్తుందో లేదోగాని బ్యాక్టీరియా వల్ల చాలామందికి చర్మరోగాలు మాత్రం వచ్చాయన్నాడు. దీనిని పూర్ణానంద స్వామి ఖండిస్తూ... గోరా గోపాల్ మూర్ఖంగా మాట్లాడుతున్నారు. పుష్కరాలను ఈ విధంగా కూడా చేయొచ్చని చంద్రబాబు చూపించారు. గతంలో గోదావరి పుష్కరాలంటే ఆ రెండు గోదావరి జిల్లాల వాళ్లకే తెలిసేది. ఇప్పుడు ప్రపంచానికే తెలియజేసిన ఘనత చంద్రబాబుది. దేశంలోని 12నదుల పుష్కరాలకు కూడా ఆయననే ఇన్‌ఛార్జ్‌గా నియమిస్తే బాగుంటుందన్నారు. వెంటనే అంబటి రాంబాబు... సార్, వీళ్లు భక్తితో పుష్కరాలు నిర్వహించలేదు. పుష్కరాల పేరుతో 2వేల కోట్లు తిన్నారు. డబ్బు తినేసి తూతూ మంత్రంగా పనులు చేశారు. పుష్కరాల ప్రారంభం రోజే 27మందిని చంపారు. రోడ్డు ప్రమాదాలలో మరో 300మంది దాకా చనిపోయారు. ఈ చావులన్నింటికి చంద్రబాబే కారణమని అంబటి ఆవేశంగా మాట్లాడాడు. అప్పుడు నైట్‌రైడర్, మున్సిపల్ మంత్రి నారాయణ ఆవేశంగా లేచి... ఏం మాట్లాడుతున్నావ్ నువ్వు... మతి వుండే మాట్లాడుతున్నావా, ఇంత పెద్ద ఎత్తున పుష్కరాలు జరిపి, ఇన్ని కోట్ల మంది భక్తులు వస్తే ఆ మాత్రం చనిపోకుండా ఉంటారా, ఈ పుష్కరాల వల్ల రాష్ట్రానికి ఎంత మేలు జరిగిందనుకుంటున్నావ్... పురోహితులు సంపాదించుకున్నారు, రాజమండ్రిలో హోటల్స్ వాళ్లు, ఇతర వ్యాపారాలు బాగా జరిగాయి, ఇక రాష్ట్ర వ్యాప్తంగా ట్రావెల్స్ వాళ్లయితే పండుగ చేసుకున్నారు. నష్టాల్లో ఉండే ఆర్టీసీ కోట్ల రూపాయలు సంపాదించుకుంది. చర్మవ్యాధుల డాక్టర్లకు పేషంట్లు పెరిగారు. ఇందరికి మంచి చేసిన మా చంద్రబాబును విమర్శిస్తారా... అంటూ కయ్‌మన్నాడు. వీళ్లే కాదు, పుష్కరాల పేరుతో వందల కోట్లు తిని మీ పార్టీ వాళ్లు కూడా బాగుపడ్డారంటూ అంబటి అరిచాడు. దీంతో నారాయణకు అంబటికి మధ్య మాటామాటా పెరిగి అరగంటసేపు అరుచుకున్నారు. అప్పుడు ఆ ఛానెల్ ప్రతినిధి గ్యాస్ గన్నారావు తాపీగా... ఇక చాలు ఆపండి... మీ మధ్య ఈ రచ్చ కోసమే చర్చ పెట్టాను, ఇక్కడితో ఈ రచ్చను... సారీ సారీ... చర్చను ముగిస్తున్నానంటూ లేచాడు.

★★★★★

రాజమండ్రిలోని తన గెస్ట్‌హౌస్‌లో చంద్రబాబు మౌనంగా కూర్చుని వున్నాడు. ఆయన ముఖంలో బాధ, దిగులు, ఆవేదన, ఆందోళన, దుఃఖం వంటి భావాలన్నీ కొట్టొచ్చినట్లు కనిపించడం లేదు గాని, ఆయన మనసులో మాత్రం ఇవన్నీ ఉన్నాయి. పుష్కరాల 11రోజులు ఎంతో హుషారుగా తిరిగిన చంద్రబాబు చివరి రోజు నిరుత్సాహంగా ఉండడాన్ని మంత్రులు దేవినేని ఉమ, పత్తిపాటి పుల్లారావు, చింతకాయల అయ్యన్నపాత్రుడు, పి.నారాయణలు గమనించారు. అప్పుడే అక్కడకు చినజీయర్‌స్వామి, పరిపూర్ణానంద స్వామిలు కూడా వచ్చారు. పత్తిపాటి పుల్లారావు వారితో... స్వామీ, మా సీఎం నిద్రలేచినప్పటి నుండి నిరుత్సాహంగా ఉన్నారు. కారణమేంటో మీరన్నా కనుక్కోండి స్వామి అని అడిగాడు. అప్పుడు పరిపూర్ణానంద స్వామి చంద్రబాబు వద్దకెళ్లి... ఏం నాయనా అలా వున్నావు, పుష్కరాలను ఎంతో విజయవంతం చేసావు, తొలిరోజు 27మంది భక్తులు చనిపోయినందుకు ఇంకా బాధపడుతున్నావా... అని అడిగాడు. అప్పుడు చంద్రబాబు... భలేవారు స్వామి, ఆ 27మంది చనిపోయిన విషయం పక్కరోజే మర్చిపోయాను. ఈ పుష్కరాలు 12 రోజులు 12నిముషాల్లా గడిచిపోయాయి. ఈ 12రోజులు ఇక్కడ గడిపాను, హైదరాబాద్ పోవాలంటే 'ఓటు-నోటు' కేసు భూతం వెంటాడుతుంది, గోదావరి పుష్కరాలను 12 రోజులు కాకుండా 12నెలల పాటు నిర్వహించే సాంప్రదాయం ఉండుంటే బాగుండేదని వాపోయాడు. దానికి చినజీయర్ స్వామి... రాజ్యాంగాన్ని మార్చినట్లు శాస్త్రాలను మార్చేరోజులొచ్చాయి నాయనా... నీకు అవసరమనుకుంటే ఆ విధంగా కూడా శాస్త్రాన్ని మార్చుకుందామన్నాడు. అప్పుడు దేవినేని ఉమ... సార్, గోదావరి పుష్కరాలు అయిపోయాయని బాధపడ్డమెందుకు, ఎలాగూ వచ్చే ఏడాదే కృష్ణ పుష్కరాలు. రాజమండ్రి నుండి నేరుగా విజయవాడ పోదాం, ఈ ఏడాదంతా అక్కడే వుంటూ కృష్ణ పుష్కరాల ఏర్పాట్లను పరిశీలిద్దాం, పనిలో పనిగా కృష్ణ పుష్కరాలకు కూడా ఇంకో రెండువేల కోట్లు కేటాయిస్తే సరి.. పనులు చేసుకుంటూ ఉందామని ప్రతిపాదించాడు. కృష్ణ పుష్కరాల మాట వినగానే చంద్రబాబు ముఖంలో అమావాస్య చీకట్లు తొలగిపోయి పున్నమి వెలుగులు తొంగిచూసాయి.



# ప్రతిభకు బిఎంఆర్ ప్రోత్సాహం

జిల్లాకు సంబంధించి విద్య, వైద్య రంగాల్లో బిఎంఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ గత కొన్నేళ్లుగా నిరుపమాన సేవలు అందిస్తుంది. ఈ పరంపరలో భాగంగానే జూలై 26వ తేదీన పదోతరగతి, ఇంటర్‌లో అత్యంత ప్రతిభ కనపరచిన 63మంది నూర్‌బాషా, దూదేకుల విద్యార్థులకు ట్రస్ట్ తరపున ప్రోత్సాహక బహుమతులను అందించారు. నెల్లూరులోని పాత జడ్పీ సమావేశ మందిరంనందు జరిగిన ఈ కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు, మేయర్ అబ్దుల్ అజీజ్, నెల్లూరు నగరఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, రాష్ట్ర నూర్‌బాషా, దూదేకుల బి.సి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ సలీం తదితరులు పాల్గొన్నారు.

# వాడవాడలా... కలాంకు కన్నీటి నివాళి



భారత రత్న డాక్టర్ అబ్దుల్ కలాం అంతరిక్షంపై సుదీర్ఘమైన అనుభవం కలిగిన మహామేధావని ఇస్రో మాజీఛైర్మెన్ డాక్టర్ కస్తూరిరంగన్ కొనియాడారు. మంగళవారం షార్ ఉద్యోగుల ఆధ్వర్యంలో బ్రహ్మప్రకాష్ హాలులో ఇస్రో శాస్త్రవేత్తలందరూ అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. భరతమాత ముద్దుబిడ్డ, మాజీ రాష్ట్రపతి, భారతరత్న అబ్దుల్ కలాం తిరిగిరాని లోకాలకు వెళ్లడం ఎంతో బాధాకరమని ఏబివిపి నగర సంఘటన కార్యదర్శి రాజేష్ అన్నారు. విఆర్‌సి సెంటర్‌లో అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. నరేంద్ర, హరీష్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో మంగళవారం ఏపి ప్రత్యేక హోదా విద్యార్థి విభాగం నాయకులు అబ్దుల్ కలాంకు నివాళులర్పించారు. అంజయ్య, రమణయ్య, నాగేంద్ర, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి కలాం మృతికి సంతాపం తెలిపారు. కలాం మరణం దేశానికి తీరనిలోటన్నారు. జడ్పీ కార్యాలయంలో ఉద్యోగులు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిఆర్‌డిఏ, సిపిఓ, డిపిఆర్‌ఓ, డిఎస్‌ఓ, డ్వామా తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా శాఖల జిల్లా అధికారులు అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కార్యాయంలో కాయల సతీష్‌కుమార్, షఫి మాలిక్ శ్రీరామకృష్ణ, రాజశేఖర్, ఎంఎం ప్రసాద్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెల్లూరు బార్ అసోసియేషన్‌లో న్యాయ వాదులు కోర్టు విధులను బహిష్కరించి కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బార్ అధ్యక్షుడు రామ చంద్రారెడ్డి, న్యాయమూర్తులు పాల్గొన్నారు. మాజీరాష్ట్రపతి దివంగత అబ్దుల్‌కలాం మృతికి నెల్లూరులోని గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ డా॥ జి.సుబ్బారావు, సిబ్బంది ఆయన ఆత్మశాంతికి మౌనం పాటించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ క్యాన్సర్ ఆసుపత్రిలో అబ్దుల్ కలాంకు నివాళులర్పించారు. మాగుంట లే అవుట్‌లోని విశ్వసాయి జూనియర్ కాలేజీలో భారత క్షిపణి పితామహుడు, మాజీ రాష్ట్రపతి అవుల్‌పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం మృతి పట్ల సంతాపసభ ఏర్పాటు చేసి ఆయన చిత్రపటానికి కళాశాల ఛైర్మెన్ డా॥ ఎన్.సత్యనారాయణ తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధుల, బాలల ఆశ్రమంలో ప్రియదర్శిని ఇంజనీరింగ్ విద్యార్థులు శ్రద్ధాంజలి ఘటించారు. విద్యార్థులు, ఆశ్రమ వ్యవస్థాపకులు తమ్మినేని పాండు పాల్గొన్నారు. లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు మక్కెన అంకయ్యచౌదరి ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుజబుజనెల్లూరులోని సంస్థ కార్యాలయంలో అబ్దుల్ కలాం మృతికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు కె.మురళీమోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు. విజయమహల్ గేటు వద్ద గల నేతాజీ(ఎంఎస్ఆర్) పైలట్ హైస్కూల్‌లో కరస్పాండెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి తదితరులు కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. మాగుంట లే అవుట్‌లోని వేదవ్యాస స్కూల్ యాజమాన్యం తాను మరణిస్తే ఒక గంట అదనంగా పనిచేయా లన్న విషయాన్ని గుర్తు చేసుకుంటూ స్కూలును ఒక గంట అదనంగా నిర్వహించారు. విద్యార్థులు కొవ్వొత్తులు వెలిగించి కలాంకు నివాళులర్పించారు.



# కావలి కబుర్లు

# సొంత నిధులతో రోడ్డు మరమ్మత్తులు

## చెప్పటమే కాదు.. చేసి చూపిస్తున్న ఉపాధ్యాయుడు కోటేశ్వరరావు



సమాజసేవే వరమా వధిగా, సమాజమే దేవాల యంగా భావించి తన సొంత నిధులతో పట్టణంలోని పెద్ద పవని రోడ్డును మరమ్మత్తులు చేయిస్తున్న ఉపాధ్యాయుడు చీదెళ్ళ పెదకోటేశ్వరరావు ఉపాధ్యాయులకే కాక నేటి యువతకు ఆదర్శప్రాయుడు. పట్టణంలోని వైకుంఠపురంలో నివాసముంటున్న కోటేశ్వరరావు కొండాపురం మండలం, ఉప్పలూరు గ్రామంలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తుంటాడు. పాఠశాలలో విద్యార్థులకు దేశ నాయకుల గురించి పాఠాలు బోధిస్తూ మహాత్ముడు దేశానికి స్వాతంత్ర్యం తెచ్చాడని, ఆయన కలలు కన్న సమాజం అభివృద్ధి చెందాలంటే విద్యార్థులే భావితరాల నాయకులు కావాలని, వీరు సమాజసేవలో పునీతులవ్వాలని బోధిస్తుంటాడు. కోటేశ్వరరావు గత 5సంవత్సరాలుగా సమాజసేవ చేయాలనే సంకల్పంతో పుట్టి పెరిగిన పట్టణంలోని ధ్వంసం అయిన రోడ్లను చూసి పాలకులను ప్రశ్నించటం కంటే ఉడతా భక్తిగా ఆయనే దగ్గరుండి సొంత నిధులతో రోడ్డు మరమ్మత్తు చేయిస్తున్న దృశ్యం 'లాయర్' కంట పడింది. ప్రజాప్రతినిధులు, స్థానిక మున్సిపల్ అధికారులు చేపట్టవలసిన ఈ పనులను ఒక ఉపాధ్యాయుడు చేయించడం అభినందనీయం.

# ట్రంకురోడ్డుపై ఇసుక


- పట్టించుకోని అధికారులు
- ఇష్టాను సారంగా బిల్డర్లు



కావలి పట్టణంలో పెరుగుతున్న వాహనాలను దృష్టిలో పెట్టుకుని ట్రంకు రోడ్డు విస్తరణ పనులను కావలి పుర పాలక శాఖ ఒక ప్రక్క చేపడుతున్నా మరోప్రక్క ట్రంకురోడ్డు పైనే బిల్డింగ్ నిర్మాణ యజమానులు ఇసుక, కంకర, ఇటుకలను సైతం తోలి వారి నిర్మా ణాలు పూర్తి చేసుకుంటున్నారు. దీని వలన పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా మున్సిపల్, ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు అంటున్నారు. ముఖ్యంగా ఒంగోలు బస్టాండ్ సమీపంలో భారీ నిర్మాణాలను చేపట్టిన యజమానులు ఇష్టానుసారంగా వారి హద్దులను దాటి రోడ్డు స్థలాలను ఆక్రమిస్తున్నా, భవన నిర్మాణానికి కావలసిన ఇసుక, కంకర, ఇటుకలను రోడ్డుపై వేసి యథేచ్ఛగా వారి పనులను సాగిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలోనే ఇలా జరుగుతున్నా సంబంధిత అధికారులు కళ్లప్పగించి చూస్తుండి పోవడానికి గల కారణమేమిటో... ఈ విషయానికి స్థానిక మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ శ్రీనివాసులును వివరణ కోరగా, ఆయన దీనిపై స్పందిస్తూ ఆ భవన యజమానికి గతంలో అక్కడ కలిగే సమస్యలను వివరించామని, ఇకపై అలా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో ఇలాంటి సమస్యలు పలుచోట్ల ఉత్పన్నమౌతున్నాయని, ఎక్కువగా ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న కొందరిపై చర్యలు తీసుకున్నా వీటిని నివారించవచ్చు.

## కాలధర్మం

# మోపూరు ఎర్రమ్మ



నెల్లూరులో కొందరికి అలం కార్ పెంచలయ్యగా, మరికొందరికి రాజీ పెంచలయ్యగా సుపరిచితు డైన మోపూరు పెంచలయ్య మాతృ మూర్తి మోపూరు ఎర్రమ్మ జూలై 28వ తేదీ స్వర్గస్థులైనారు. ఆమె వయసు 92 సంవత్సరాలు. ఎర్రమ్మకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. పెద్దకొడుకు పెంచలయ్య నెల్లూరులోనే కాకుండా స్వగ్రామమైన సౌత్‌మోపూరులోనూ కాలేజీ అభివృద్ధి కమిటీ ఛైర్మెన్‌గా వుంటూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఎర్రమ్మ మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.


## హెల్మెట్‌ను ధరించండి ప్రాణాలను కాపాడుకోండి

ద్విచక్రవాహనదారులారా...

ఆగష్టు 1 నుండి హెల్మెట్‌ను ధరించండి.

ప్రభుత్వము, పోలీసు మీ కోసమే అమలు చేస్తున్న ఈ నిబంధనను పాటించండి.

మీ అందమైన భవిష్యత్‌ను ఉజ్వలంగా ఉంచుకోండి.

**యస్.రాఘవరావు**
డి.ఎస్.పి - కావలి

**యం.మధుబాబు**
సి.ఐ - కావలి రూరల్ సర్కిల్

మరియు **పోలీసు సిబ్బంది**

## హెల్మెట్ ధరించండి - ప్రమాద రక్షణ పొందండి

## కావలి 1- టౌన్ పోలీసు వారి సూచన



ద్విచక్ర వాహనదారులారా.. ఆగష్టు 1వ తేదీ, 2015 నుండి కావలి పట్టణంలో శిరస్త్రాణం(హెల్మెట్) తప్పనిసరిగా ధరించి పోలీసు వారికి సహకరించండి.

- హెల్మెట్ ధరించుట వలన ప్రమాద సమయంలో తలకు దెబ్బ తగలకుండా కాపాడును.

**యస్.రాఘవరావు**
డి.ఎస్.పి, కావలి

మరియు కావలి 1వ పట్టణ పోలీసు సిబ్బంది.

# జాతిరత్నమా... జోహార్!

***ఈ తరం... దేశ స్వాతంత్రోద్యమాన్ని నడిపిన మహాత్మా గాంధీని చూడలేదు. తెల్లదొరలతో వీరోచితంగా పోరాడిన నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను చూడలేదు. రాజ్యాంగ పదవికే వన్నె తెచ్చిన తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్‌ను, సంస్థానాలన్నింటిని భారత రాజ్యంలో విలీనం చేసిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్ బాయ్ పటేల్‌ను, స్వరాజ్యం కోసం ఉరి కొయ్యను ముద్దాడిన భగత్‌సింగ్‌నూ చూడలేదు. ఈ దేశ భక్తులను చూసే అదృష్టం ఈ తరానికి దక్కలేదు. కాని ఒక్క అదృష్టం మాత్రం ఈ తరం వారి సొంతం. ఈ దేశ భక్తులందరినీ కలబోసి పూతబోసిన అద్భుత వ్యక్తి, దేశ శక్తి అబ్దుల్ కలాం.***

ఈ తరం వ్యక్తి... మన తరం మనిషి... మనం చూసిన మహనీయుడు... మనల్ని పాలించిన గొప్ప నాయకుడు. ఈ దేశంలో పుట్టాడు, ఈ దేశం కోసమే పుట్టాడు. ఈ మట్టిలో పెరిగాడు... ఈ మట్టితో అద్భుతాలు చేసాడు. జాతీయోద్యమ నాయకులంతా ఆనాడు భారత మాత దాస్య శృంఖలాలను తెంచడానికి పోరాడితే ఈ యోధుడు మాత్రం ప్రపంచంలోనే భారత దేశాన్ని శాస్త్ర సాంకేతిక, అణు రంగాలలో అగ్రగామిగా నిలపడానికి అహర్నిశలూ కృషి చేశాడు. చివరి క్షణం వరకు దేశ సేవలోనే తరిస్తూ ఈ మట్టిలోనే మమేకమయ్యాడు.

ఆ మహోన్నత వ్యక్తి దేశ భక్తిని, దేశానికి చేసిన సేవను కొలిచే పరికరాన్ని ఇంతవరకు ఏ శాస్త్రవేత్త కనిపెట్టలేదు. ఆయన వ్యక్తిత్వం ముందు ఎవరెస్ట్ చాలా చిన్నది. ఆయన హృదయ వైశాల్యం ముందు విశ్వమే చిన్నబోవాల్సిందే! ఆయన అంకితభావానికి, ఆయన చిత్తశుద్ధికి ఆకాశమే తలవంచింది. ఆ ధీరుడు, ఆ దేశ భక్తుడు, నూరణాల భారతీయుడు, భారతరత్న, మాజీ రాష్ట్రపతి అవుల్ పకీర్ జైనులబ్దీన్ అబ్దుల్ కలాం అనే అద్భుతం ఇక ఈ భూమిపై లేదు. భౌతికంగా ఆ రూపాన్ని ఇక మనం చూడలేం. 120కోట్ల భారతీయుల గుండెలు మాత్రం అతని జ్ఞాపకాలతో నిండిపోయాయి. ఆ విజ్ఞాన మహర్షి ఇక లేడన్న మరుక్షణమే 240కోట్ల కళ్లు కన్నీళ్లు చిందించాయి. ఈ ప్రత్యక్ష దైవానికి భారత దేశమే భాష్పాంజలి ఘటించింది.

భారతరత్న అబ్దుల్ కలాం 84ఏళ్ల ప్రయాణం తర్వాత కూడా అలసిపోలేదు. ఆయన మనసే కాదు శరీరం కూడా విశ్రాంతిని కోరుకోలేదు. తుదిశ్వాస విడిచే చివరి క్షణాలలో కూడా ఆయన ఈ దేశ సేవలోనే గడిపారు. భావిభారతానికి ఉత్తమపౌరులను అందించాలనే ఆశయంతో జూలై 27వ తేదీ సాయంత్రం మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో 'లివబుల్ ప్లానెట్' అంశంపై ఉపన్యసిస్తూ 6.40గంటల ప్రాంతంలో కుప్పకూలిపోయారు. వెంటనే ఆయనను సమీపంలోని బెథానీ హాస్పిటల్‌లో చేర్చి వైద్యులు విశ్వ ప్రయత్నాలు చేసినా ఆయన ప్రాణాలను మాత్రం నిలపలేకపోయారు. కలాం లేడన్న వార్తతో దేశమే దిగ్భ్రాంతికి లోనయ్యింది.

అబ్దుల్ కలాం అనే ఈ విజ్ఞాన శిఖరం 1931 అక్టోబర్ 15వ తేదీన తమిళనాడు రాష్ట్రం రామేశ్వరంలోని ఓ పేద ముస్లిం కుటుంబంలో జన్మించింది. రామేశ్వరం దక్షిణ భారతదేశ తీరప్రాంతం. రాముడు శ్రీలంకకు వారధి కట్టిన పుణ్యప్రాంతం. ఆనాడు రాముడితో ఈ ప్రాంతానికి ప్రాశస్త్యం వస్తే. ఈ యుగంలో కలాముడి జననంతో ఆ ఊరు మరోసారి చరిత్ర పుటల్లోకి ఎక్కింది. కలాం తండ్రి పడవ నడుపుకునేవారు. పేదరికంలో పుట్టిన కలాం ఆ నేపథ్యంలోనే పెరిగాడు. అక్కడే చదివాడు. అక్కడే ఎదిగాడు. విద్యార్థి దశలోనే పేపర్ బాయ్‌గా మారాడు. తెల్లారుజామునే లేచి ఇంటింటికి పేపర్ వేసేవాడు. ఆ తర్వాత ఇంటికొచ్చి పుస్తకాలు పట్టేవాడు. 1954లో తిరుచిరాపల్లిలో ఫిజిక్స్‌లో పట్టభద్రుడయ్యారు. 1965లో చెన్నైలో మద్రాసు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి ఏరోనాటిక్స్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రులయ్యారు. చిన్నతనంలోనే శివకాశిలో తయారు చేసిన రాకెట్లను దీపావళి పండుగనాడు ఆకాశంలోకి వదలడం, అవి నిప్పులు చిమ్ముకుంటూ పోవడం చూసేవాడు. భవిష్యత్ రాకెట్ ప్రయోగాల రూపకల్పనకు అప్పుడే ఆయన ఆలోచనలు శ్రీకారం చుట్టాయి. మొదట రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థలలో పనిచేసారు. ఆ తర్వాత భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో)లో పనిచేశారు. అటు రక్షణ రంగాన్ని, ఇటు అంతరిక్ష విభాగాన్ని ఆయన తన రెండు కళ్లుగా భావించారు. నెల్లూరుజిల్లా శ్రీహరికోటలోని షార్ సెంటర్ రూపకర్తలలో ఆయన ఒకరు. ప్రఖ్యాత సైంటిస్ట్ విక్రమ్ సారాభాయ్‌తో కలిసి ఇక్కడ స్పేస్ సెంటర్ నెలకొల్పడానికి ఆయన ఎంతగానో శ్రమించారు. సైకిల్ మీద, ఎడ్ల బండ్ల మీద ఉపగ్రహాలను తెచ్చి రాకెట్లను ప్రయోగించిన తరం కలాందే! 1980లో స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఎస్ఎల్‌వి రాకెట్‌కు కలాం ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఈ రాకెట్ ద్వారా 'రోహిణి' ఉపగ్రహాన్ని ప్రయోగించారు. ఇలా ఆయన భారత అంతరిక్ష ప్రయోగాలెన్నింటిలోనో పాలుపంచుకున్నారు.

ఇక దేశ రక్షణ రంగంలో కలాం పాత్ర మరువలేనిది. భారత దేశానికి అణు పితామహుడాయన. శత్రువుల గుండెల్లో దడపుట్టించే అగ్ని, పృథ్వి, నాగ్, ఆకాశ్ వంటి సుదూర లక్ష్యాలను ఛేధించగల క్షిపణుల రూపశిల్పి ఆయన. అగ్రదేశాలకు ధీటుగా భారత క్షిపణి వ్యవస్థను పటిష్టం చేసి దేశానికి రక్షణ కవచం నిర్మించాడు. శాస్త్రవేత్తగా దేశానికి ఆయన అందించిన సేవలు వర్ణించాలంటే పెద్దపెద్ద గ్రంథాలవుతాయేమో! ఆయన సేవలకు ప్రభుత్వాలు ఇవ్వని అవార్డు లేదు. దేశంలో క్రింది స్థాయి నుండి భారతరత్న దాకా ఆయన అందుకోని అవార్డులు లేవు. దేశంలో ప్రసిద్ధి చెందిన 40యూనివర్శిటీలు ఈ విజ్ఞాన సాగరానికి డాక్టరేట్‌లు అందించడం ద్వారా తమ స్థాయిని పెంచుకున్నాయి. ఆయన ప్రతిభను, ఆయన పరిజ్ఞానాన్ని కొలిచే అవార్డులు కూడా ఈ భూమ్మీద లేవు. 1998లో ప్రధాని వాజ్‌పేయికి ఆయన ప్రధానశాస్త్ర సలహాదారుగా పని చేశారు. ఆ యేడాదే పోఖ్రాన్‌లో అగ్రరాజ్యాలకు సైతం అంతుపట్టకుండా నిర్వహించిన ఐదు అణుపరీక్షల విజయంలో కలాందే ప్రధాన పాత్ర. భారతదేశానికే కాదు ప్రపంచాని కంతా ఈ అణుయోధుడి పేరు తెలిసింది కూడా అప్పుడే! భారత దేశానికి ఒక రక్షణ కవచాన్ని తయారుచేసి తొడిగిన రూపశిల్పి ఆయన.

దేశం నీకేమిచ్చిందని కాదు, దేశానికి నువ్వేమిచ్చావని ప్రశ్నించుకో అని కలాం యువతకు ఉపదేశిస్తుంటారు. కలాం వేసిన ప్రశ్నకు సమాధానం కూడా కలామే. ఎందుకంటే ఆయన దేశానికి చేసింది ఎక్కువ. మరి దేశం ఆయనకు ఏం ఇవ్వగలదు! ఆయన సేవలను ఎలా గుర్తించగలదు. ఆయన ప్రతిభను, ఆయన దేశభక్తిని మనం గౌరవించగలిగింది ఒక్క రాజ్యాంగ పదవితోనే! భారతదేశ అత్యున్నత రాజ్యాంగ పదవి అయిన భారత రాష్ట్రపతి పదవినివ్వడం ద్వారా ఈ దేశం తనను తాను సత్కరించుకుంది. 2002 జూలైలో అప్పటి ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం సేవలను ప్రతిపాదించింది. కలాం పేరును ఇక కాదనేదెవరు? ఎడ్డెం అంటే తెడ్డెం అనే వామపక్షాలు మినహా మిగిలిన అన్ని పార్టీలు భారత రాష్ట్రపతిగా అబ్దుల్ కలాంకు జైకొట్టాయి. వామపక్షాలు తమ అభ్యర్థిగా లక్ష్మీసెహగల్‌ను బరిలోకి దింపినా కలాం ముందు ఆమె నిలవలేక పోయారు. 2002జూలై 18వ తేదీన భారత 11వ రాష్ట్రపతిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు.

### రాజ్యాంగ పదవికే వన్నె తెచ్చారు

రాష్ట్రపతి అంటే ఎలా వ్యవహరించాలనేదానికి కాదు, ఇలాగే వ్యవహరించాలనే దానికి అబ్దుల్ కలాం రోల్‌మోడల్‌గా నిలిచారు. రాష్ట్రపతి అంటే రబ్బర్‌స్టాంప్ అన్న అభిప్రాయాన్ని తుడిచిపెట్టారు. బాబూ రాజేంద్రప్రసాద్, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌లు మనం చరిత్ర పాఠాల్లో చదువుకున్న గొప్ప రాష్ట్రపతులు. మనం ప్రత్యక్షంగా చూసిన గొప్ప రాష్ట్రపతి మాత్రం కలామే! రాష్ట్రపతిభవన్‌ను ప్రజాభవన్‌గా మార్చాడాయన. సామాన్యులకు చేరువయ్యాడు. సూపర్‌సానిక్ వేగంతో వెళ్లే సుఖోయ్ యుద్ధవిమానంలో ప్రయాణించినా, సముద్రజలాల్లో వెళ్లే జలాంతర్గామిలో ప్రయాణించినా, సామాన్యుడిలా రైలులో వెళ్లినా ఆయనకే చెల్లింది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన బిల్లులకు గుడ్డిగా ఆమోదముద్రవేయలేదు. ప్రజలకు ఇబ్బంది అనుకున్న బిల్లులను నిర్ధ్వంద్వంగా తిప్పి పంపారు. రాష్ట్రపతిగా దేశంలోని ఎక్కువ రాష్ట్రాల అసెంబ్లీల్లో ప్రసంగించింది ఆయనే! దేశ వ్యాప్తంగా పర్యటించింది కూడా ఆయనే! రాష్ట్రపతి అంటే రబ్బరు స్టాంప్ కాదని, రాజ్యాంగ పాలకుడు, రాజ్యాంగ రక్షకుడు అని చాటింది కూడా ఆయనే!

### రెండోసారి కోల్పోయిన అవకాశం

భారత రాష్ట్రపతిగా రెండోసారి కూడా కలాంనే కొనసాగించాలని ఎన్డీఏ పక్షాలు భావించాయి. ఆయన అభ్యర్థిత్వం కోసం అభ్యర్థించాయి. అయితే పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నుకునే పనైతేనే ఉంటానని కలాం తన అభిప్రాయం చెప్పారు. కలాం వంటి గొప్ప వ్యక్తిని రెండోసారి రాష్ట్రపతి కాకుండా అడ్డుకున్నది కాంగ్రెస్ పార్టీయే! ఆయన అభ్యర్థిత్వానికి కాంగ్రెస్ మద్దతు పలకలేదు. ప్రతిభా పాటిల్‌ను తమ అభ్యర్థిగా ప్రకటించింది. ఆరోజు యూపిఏ అధికారంలో వుంది. పోటీ చేయడం ఇష్టం లేని కలాం గౌరవంగా బీజేపీ వినతిని తిరస్కరించారు. రెండోసారి కలాంను రాష్ట్రపతిగా చేసుకునే అవకాశాన్ని కాంగ్రెస్ కాదనడానికి కారణం సోనియాగాంధీనే! 2004లో కేంద్రంలో యూపిఏకు పూర్తి మెజార్టీ వచ్చింది. సోనియాగాంధీనే ప్రధాని అనేది ఖరారైంది కూడా! ఆమె కూడా ప్రధాని పగ్గాలు చేపట్టడానికి ఉత్సాహపడింది. మెజార్టీ వచ్చింది కాబట్టి ప్రభుత్వ ఏర్పాటుకు తమను ఆహ్వానించాలంటూ సోనియా రాష్ట్రపతిగా వున్న కలాంను కలిసింది. రాజ్యాంగంలో జన్మఃతహ విదేశీయులు అత్యున్నత పదవులు చేపట్టరాదన్న నిబంధనను కలాం అక్కడ ఆమె ముందుంచారు. దీంతో అప్పటికప్పుడు ఆమె తన నిర్ణయాన్ని మార్చుకుని మన్మోహన్‌సింగ్‌ను ప్రధానిగా ప్రకటించింది. తాను ప్రధాని కాకుండా అడ్డుకున్న కలాంపై ఆమె మనస్థాపం చెందింది. దీనివల్లే రెండోసారి రాష్ట్రపతిగా ఆయనకు మద్దతు తెలపలేకపోయింది. ఈ విషయాలు ఆరోజు ప్రపంచానికి తెలియలేదు. కాంగ్రెస్‌వాళ్లు మాత్రం సోనియాను ప్రధాని పదవిని వదులుకున్న త్యాగమూర్తిగా ప్రచారం చేసుకోసాగారు. కలాం వ్రాసిన తన ఆత్మకథలో ఈ విషయాలను ప్రస్తావించారు.

రాజ్యాంగ పదవిపై తన ముద్రవేసి రాష్ట్రపతి పదవి నుండి వైదొలిగాక కూడా కలాం శరీరం, మనసు విశ్రాంతి కోరుకోలేదు. దేశానికి మంచి విద్యార్థులను, విజ్ఞానవంతులను అందించాలనే లక్ష్యంతో బోధనపై దృష్టిపెట్టారు. దేశంలోని పలు యూనివర్శిటీలు, కాలేజీలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా, వైస్‌ఛాన్సలర్‌గా వ్యవహరించసాగారు. దేశమంతా తిరుగుతూ సైన్స్ పాఠాలు బోధించ సాగారు. అలా తనకిష్టమైన బోధనలోనే ఆయన చివరి క్షణాలు గడిచిపోయాయి.

ఏ మట్టి మీదయితే పుట్టాడో, ఏ నేలమీదైతే పెరిగాడో, ఏ గ్రామంలో అయితే ఎదిగాడో అదే ఊరిలో అదే మట్టిలో భూమాత ఒడిలో ఆయన జూలై 30వ తేదీన ఈ లోకానికి వీడ్కోలు పలుకుతూ ఒదిగిపోయాడు. కలాం పాదస్పర్శతో నాలుగు దిక్కులు పునీతమయ్యాయి. దక్షిణాన పుట్టాడు, పడమరలో పని చేశాడు, ఉత్తరాన వుండి దేశాన్ని పాలించాడు, తూర్పున తనువు చాలించాడు.

***భారతమాతకు వరాల పుత్రుడివి... నూటఇరవై కోట్ల మందికి అభిమాన పాత్రుడివి, చిన్నారుల మిత్రుడివి... దేశ రక్షకుడివి, దేశభక్తుడివి... మా అందరికీ మార్గదర్శకుడివి... కలాముడా... మీకు జోహార్!***




కీ॥శే॥ మాగుంట రాఘువరెడ్డి గారు

## శ్రద్ధాంజలి

మా ఇంటి జ్యోతి, నిరంతరం మా హృదయాంతరాలలో వెలిగే ధృవతార
మా అభివృద్ధికి కారకులు, అనురాగంతో మమ్మల్ని
తన గుండెలలో దాచుకున్న ప్రేమమయుడు
మా తండ్రి కీ॥శే॥ మాగుంట రాఘువరెడ్డి గారు.

01-08-2015 శనివారం ఆ మహనీయుని 38వ వర్ధంతి సందర్భంగా
వారి పవిత్రాత్మకు మా శ్రద్ధాంజలి.

కుమారులు
మాగుంట సుధాకర్‌రెడ్డి
మాగుంట శ్రీనివాసులురెడ్డి

మనుమడు
మాగుంట విజయారెడ్డి

# నెల్లూరులో తిరుమలేశుడు

## 9రోజుల పాటు జరగనున్న "శ్రీ వేంకటేశ్వర వైభవం"

**శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఏడు కొండలు దిగి 9రోజులు మన నెల్లూరులో కొలువు తీరనున్నాడు. నెల్లూరు ఏసి స్టేడియంలో నిర్మిత మవుతున్న నమూనా ఆలయంలో నెల్లూరుజిల్లా వాసులకు దర్శనమివ్వ బోతున్నాడు. ఆగష్టు 8వ తేదీ నుండి ఆగష్టు 16వ తేదీ వరకూ భక్తుల మంగళహారతులు అందుకోబోతున్నాడు.**

నెల్లూరుకు మంచిరోజులు రాబోతున్నాయి. సాక్షాత్తూ ఆ ఏడుకొండలవాడు తన ఇద్దరు సతుల సమేతంగా 9రోజులు నెల్లూరులో శ్రీ వేంకటేశ్వర వైభవాన్ని చూపించబోతున్నాడు. అన్ని రోజులూ ఇక్కడే కొలువై తిరుమలలో అందుకునే అన్ని పూజలూ నెల్లూరులోనే అందుకుంటూ కేవలం నెల్లూరీయులను అనుగ్రహించి దీవించబోతున్నాడు.

ఆగష్టు 1వ తేదీ ఉదయం 6గంటల నుండి నెల్లూరు దర్గామిట్టలోని ఏ.సి. సుబ్బారెడ్డి స్టేడియంలో "శ్రీ వేంకటేశ్వర వైభవం" సుప్రభాతసేవతో మొదలై రాత్రి 8.30గంటలకు ఏకాంత సేవతో ముగుస్తుంది.

తిరుమలలో లాగే ప్రతిరోజూ సుప్రభాతసేవతో మొదలై తోమాల, కొలువు, అర్చన, నివేదన సాత్తుమెర, వీధి ఉత్సవం, రెండవ నివేదన, సర్వదర్శనమ్, సహస్ర దీపాలంకరణ సేవ, వీధి ఉత్సవం, రాత్రి కైంకర్యం, ఏకాంత సేవలతో దినపూజలు ముగుస్తాయి. తిరుమలలో జరిగే విధంగానే ప్రతిరోజూ విశేషసేవలు కూడా యదాతథంగా జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

తిరుమలలో శ్రీవారిని దర్శించుకుంటున్న వేళలో స్వామివారి వైభవం 9



ఏర్పాట్లను పరిశీలిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టిటిడి జెఇఓ భాస్కర్, సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి



రోజుల పాటు నెల్లూరులో నిర్వహిస్తే బాగుంటుందన్న ఆలోచన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మదిలో మెదలడం, తన సంకల్పాన్ని ఆయన కేంద్ర మంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడితో పంచుకుంటున్న తరుణంలో ఆయన కుమార్తె దీపమ్మ ఆలకించి ఆసక్తి కనపరచి తమ నాన్న గారి సహకారంతో తిరుమల తిరుపతి దేవస్థానాల వారి ఆమోదంతో చదలవాడ కృష్ణమూర్తి అధ్యక్షతన టిటిడి పర్యవేక్షణలో స్వామివారి వైభవోత్సవానికి అనుమతి మంజూరు చేయించడం నెల్లూరీయుల పూర్వజన్మ సుకృతమే. ఏసి స్టేడియంలో చురుకుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అత్యంత భారీ సెట్టింగులతో నమూనా ఆలయంతో పాటు వేలాది మంది భక్తులు ఈ వైభవోత్సవాలను తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ రథాల ద్వారా జిల్లా మొత్తం కరపత్రాలను పంపిస్తున్నారు.

కలియుగ ప్రత్యక్షదైవం, అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడు, ఆపదమొక్కుల వాడు ఆ వేంకటేశ్వరుని 9రోజుల పాటు రోజూ దర్శించుకునే భాగ్యం మనకు కలుగబోతోంది. 8వ తేదీ ఉదయం సుప్రభాత సేవతో మొదలై 16వ తేదీ ఉదయం పుష్పాభిషేకంతో ఈ వైభవోత్సవం ముగియబోతోంది.

అభివృద్ధిపరంగా, అవకాశ పరంగా, ఆర్థిక పరంగా, రాజకీయ పరంగా నిర్లక్ష్యానికి గురికాబడిన నెల్లూరుకు ఇదో మంచి వరం. సాక్షాత్తూ ఆ దేవదేవుడే కరుణించి కల్పించిన భాగ్యం. ప్రతి నెల్లూరీయుడు స్వామివారిని దర్శించుకుని నెల్లూరు బాగు కోసం, సమాజ శ్రేయస్సు కోసం ప్రార్థిద్దాం. ఓం నమో వేంకటేశాయ నమః.

### ఆగష్టు 8వ తేదీ నుండి 16వ తేదీ వరకు ప్రతిరోజూ జరిగే

#### నిత్యసేవలు

| | |
|---|---|
| ఉదయం 6.00 గం॥లకు | సుప్రభాత సేవ |
| ఉదయం 6.30 గం॥లకు | తోమాలసేవ, కొలువు |
| ఉదయం 7.30 గం॥లకు | నామార్చన |
| ఉదయం 8.15 గం॥లకు | నివేదన శాత్తుమొర |
| ఉదయం 10.00 గం॥లకు | 2వ నివేదన |
| ఉదయం 10.30 గం॥ల | |
| నుండి సాయంత్రం 5.30 గం॥ల వరకు | సర్వదర్శనం |
| సాయంత్రం 5.30 గం॥లకు | సహస్ర దీపాలంకరణ సేవ |
| సాయంత్రం 6.30 గం॥లకు | వీధి ఉత్సవము |
| రాత్రి 7.30 గం॥లకు | రాత్రి కైంకర్యం |
| రాత్రి 8.30 గం॥లకు | ఏకాంత సేవ |

#### విశేష సేవలు

| | | | |
|---|---|---|---|
| 08.8.15 | శనివారం | ఉ॥ 8.30 ని॥లకు | వసంతోత్సవం |
| | | ఉ॥ 9.15 ని॥లకు | వీధి ఉత్సవము |
| 09.8.15 | ఆదివారం | ఉ॥ 6.00 గం॥ల నుండి | నిత్య సేవలు, సర్వదర్శనం |
| 10.8.15 | సోమవారం | ఉ॥ 8.30 ని॥లకు | విశేష పూజ |
| 11.8.15 | మంగళవారం | ఉ॥ 8.30 ని॥లకు | అష్టదళ పాదపద్మారాధన |
| 12.8.15 | బుధవారం | ఉ॥ 8.30 ని॥లకు | సహస్ర కలశాభిషేకం |
| 13.8.15 | గురువారం | ఉ॥ 8.30 ని॥లకు | తిరుప్పావడ |
| 14.8.15 | శుక్రవారం | ఉ॥ 8.30 ని॥లకు | అభిషేకం |
| 15.8.15 | శనివారం | ఉ॥ 8.30 ని॥లకు | వసంతోత్సవం |
| | | సా॥ 7.00 ని॥లకు | శ్రీనివాస కళ్యాణం |
| 16.8.15 | ఆదివారం | ఉ॥ 9.00 ని॥లకు | పుష్పయాగము పరిసమాప్తం |

# ఆయనో విజ్ఞాన శిఖరం

- కలాంకు సిఎంకె రెడ్డి నివాళి



2010లో చెన్నైలో ఇండియన్ జర్నలిస్ట్స్ సమావేశంలో ప్రొఫెసర్ సిఎంకె రెడ్డి ప్రసంగాన్ని అభినందిస్తూ సిఎంకె రెడ్డిని సత్కరిస్తున్న అబ్దుల్ కలాం (ఫైల్‌ఫోటో)

మాజీ రాష్ట్రపతి, మహోన్నత శాస్త్రవేత్త, మానవీయ మూర్తి 'భారతరత్న' డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం మృతి దేశానికి తీరని లోటని, ఆయన ఆకస్మిక మరణం తమకు దిగ్భ్రాంతిని కలుగజేసిందని ఆలిండియా తెలుగు ఫెడరేషన్(ఏఐటిఎఫ్), టిఏన్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రొఫెసర్ సిఎంకె రెడ్డి పేర్కొన్నారు. రామేశ్వరంలో జన్మించి, ఎంతో విజ్ఞాన సంపత్తితో గొప్ప క్షిపణి శాస్త్రవేత్తగా రాణిస్తూ, రక్షణ రంగంలోనూ, అంతరిక్ష రంగంలోనూ అబ్దుల్‌కలాం అద్భుతాలెన్నో సృష్టించారని, ఆ తర్వాత ప్రజల రాష్ట్రపతిగా ఆయన ఎనలేని ప్రఖ్యాతిని పొందారని సి.యం.కె పేర్కొన్నారు. దేశమాత సేవకై జీవితాన్ని అంకితం చేసి, నిరంతరం దేశ అభ్యున్నతికోసం కలాం ఎంతగానో తపించారని, అలాంటి మహనీయుని మృతి తమనెంతో కలచివేసిందని ఆయన ఆవేదనగా పేర్కొన్నారు.


హెల్మెట్ ధారణ - ప్రాణాలకు రక్షణ

- ద్విచక్రవాహనములు నడుపు సమయమున హెల్మెట్ ధరించుట తప్పనిసరి
- హెల్మెట్ ధరించుట వలన ప్రమాద సమయములో తలకు దెబ్బ తగలకుండా కాపాడును
- ఏకానమిలో ద్విచక్రవాహనమును నడుపుట వాహన మరియు మీ జీవితకాలాన్ని పెంచుకోండి.

ఎ.చంద్రశేఖర్‌రెడ్డి
మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ కావలి.

ఆర్.సుందరరావు
అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్, కావలి.

Sponsored by
శ్రీదేవి మోటార్స్
ట్రంకురోడ్డు, కావలి
ఫోన్. 08626 - 240243, 245243





Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY. e-mail: roopagroup@yahoo.com